www.prajaencounter.com

అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

# ప్రజా ఎన్‌కౌంటర్

తెలుగు దినపత్రిక

6 YEARS ANNIVERSARY

PRAJA ENCOUNTER NEWS (coming soon)



హైదరాబాద్ | సంపుటి :07 | సంచిక :282 | మంగళవారం 02 డిసెంబర్ 2025 పేజీలు :08 వెల :రూ.1/-

Published from : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

### రైతు వీరన్న ఆత్మహత్యకు

## ప్రభుత్వానిదే బాధ్యత

### ఆత్మహత్య కాదది.... ప్రభుత్వ హత్యే

ఎక్స్ వేదికగా హరీష్ రావు ఆరోపణ

**హైదరాబాద్,డిసెంబర్1ప్రజా ఎన్‌కౌంటర్**



ఖమ్మం జిల్లాలో రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యతని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఈ ఘటనపై స్పందించిన అయన రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రైతుది ఆత్మహత్య కాదని.. ప్రభుత్వ హత్యే అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.కౌలు రైతుల రైతు భరోసాకు సంబంధించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. కౌలు రైతుల బతుకులకు భరోసా లేకుండా చేస్తోందంటూ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. 'కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పి, నేడు వారి బతుకులకు భరోసా లేకుండా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కౌలు రైతు బానోతు వీరన్న ఆత్మహత్య అత్యంత బాధాకరం. పురుగుల మందు తాగుతూ.. పండించిన పంటకు ధర రాక, అప్పులు తీర్చే దారిలేక చనిపోతున్నా అని వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి చేసిన మోసాలకు నిదర్శనం. వీరన్నది ఆత్మహత్య కాదు, ప్రభుత్వం చేసిన హత్యనే. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని ఫలితంగా బతుకులు భారమై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఏడాదికి రూ. 15,000 రైతుభరోసా ఇస్తామని బాండ్లు రాసిచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక మోసం చేయడం దుర్మార్గం. పండించిన పంటను కొనే దిక్కులేక, మద్దతు ధర రాక, దళారుల దోపిడీకి రైతులు బలవుతున్నారు.సెల్ఫీ వీడియోలో వీరన్న చెప్పిన మాటలకైనా ఈ ప్రభుత్వానికి చలనం వస్తుందా? ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఎప్పుడు రైతు భరోసా ఇస్తారు? మీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇంకెంత మంది రైతులను బలి తీసుకుంటారు? రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటనలో కౌలు రైతు బానోతు వీరన్న కుటుంబాన్ని పరామర్శించాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రైతులెవరూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని చేతులు జోడించి విన్నవిస్తున్నాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా పోరాటం చేద్దాం.. మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది. వచ్చేది కేసీఆర్ గారి ప్రభుత్వమే.. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయి... ఎవరూ అధైర్యపడకండి అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ట్వీట్ చేశారు.

### గత పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో

# తీవ్రనిర్లక్ష్యం





పాలమూరు బిడ్డగా
ఈ గడ్డను అభివృద్ధి చేస్తా
బూర్గుల తరవాత నాకే అవకాశం ఇచ్చారు
దశాబ్దాల జిల్లా కరువును పారదోలుతా
ఉమ్మడి ఎపిలోనూ..తెలంగాణలోనూ జిల్లా నిర్లక్ష్యం
నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల
పథకాన్ని పూర్తి చేస్తా
సర్పంచ్‌లుగా మనవారినే గెలిపిస్తే మంచిది
మక్తల్ సభలో సిఎం రేవంత్ రెడ్డి

**నారాయణపేట,డిసెంబర్1ప్రజా ఎన్‌కౌంటర్**

పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను పదేళ్లపాటు గత బిఆర్ఎస్ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రత్యేక తెలంగాణలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఈ ప్రాంతానికి ఏదైనా చేయాలని గతంలో ఏ నేత కూడా అనుకోలేదని విమర్శించారు. అందుకే ఈసారి ఇక్కడి ప్రజలు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించారన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావొస్తుంది. రెండేళ్ల విజయోత్సవ సభను మక్తల్‌లో నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. స్వాతంత్య్రం వచ్చిన తొలి నాళ్లలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు సీఎం అయ్యారు. ఆ తర్వాత 75 ఏళ్లలో ఎవరూ కాలేదు. ఇన్నాళ్లకు పాలమూరు బిడ్డ రాష్ట్ర సీఎంగా మీ ముందు నిలబడ్డారు.

మిగతా 12 లో

### మహిళల కోసం ప్రత్యేకంగా

## ఎంఎస్ఎంఈ పార్కులు





- ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి చేసేలా ప్రణాళికలు
- వుమెన్ ఎంపవర్ మెంట్ ఇంటి నుంచే మొదలవ్వాలిలి
- వీ-ఎనేబుల్ గ్రాడ్యుయేషన్ వేడుక'లో మంత్రి శ్రీధర్ బాబు

**న్యూఢిల్లీ,డిసెంబర్1ప్రజా ఎన్‌కౌంటర్**

రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కును అభివృద్ధి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారులి.మహిళా సాధికారతను మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్యసాధనలో మహిళలను కీలక భాగస్వామ్యం చేస్తామన్నారు. 'వీ హబ్' ఆధ్వర్యంలో ఆదివారం జూబ్లీహిల్స్ లోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన 'వీ - ఎనేబుల్ గ్రాడ్యుయేషన్ వేడుక'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... మహిళా సాధికారత పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చాలంటే మార్పు అనేది ఇంటి నుంచే మొదలు కావాలన్నారు. ఇప్పుడిప్పుడే... సమాజంలో ప్రగతిశీల మార్పు కనిపిస్తుందని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామన్నారు. 2017-18 నుంచి 2023-24 మధ్య కాలంలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం 22 శాతం నుంచి 40.3 శాతానికి పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 52.7 శాతం అని, ఇది జాతీయ సగటు 45.2 శాతం కంటే ఎక్కువగా నమోదు కావడం రాష్ట్ర పురోగతిని ప్రతిబింబిస్తోందన్నారు. మహిళలు కూడా పురుషులకు ధీటుగా వ్యాపారాలు ప్రారంభించి విజయవంతంగా నిర్వహించగలరని 'వీ హబ్' నిరూపించిందన్నారు. ఈ స్ఫూర్తితో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ప్రారంభించే సార్టప్స్ ను

### కేరళ సిఎం పినరయ్ విజయన్‌కు

## ఇడి నోటీసులు

రూ.2,000 కోట్ల మసాలా బాండ్ కేసులో నోటీసులు జారీ



**తిరువనంతపురం,డిసెంబర్1ప్రజా ఎన్‌కౌంటర్**

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాకిచ్చింది. రూ.2,000 కోట్ల మసాలా బాండ్ కేసులో నోటీసులు జారీ చేసింది. సీఎంతోపాటూ ఆయన పర్సనల్ సెక్రటరీ, ఆర్థికశాఖ మాజీ మంత్రి థామస్ ఐజాక్‌కు సోమవారం షోకాజ్ నోటీసులు పంపింది. 2019లో మసాలా బాండ్ జారీలో విదేశీ మారకపు నిర్వహణ చట్టాన్ని ఉల్లంఘించారనే ఆరోపణలపై ఈ నోటీసులు జారీ చేసింది. రూ.466 కోట్ల లావాదేవీలకు సంబంధించి ఈ నోటీజులు జారీ చేసినట్లు తెలిసింది. రాష్ట్ర అభివృద్ధి కోసం రూ.50 వేల కోట్లను సేకరించే ప్రణాళికలో భాగంగా పినరయి విజయన్ ప్రభుత్వం ఈ బాండ్లను తీసుకువచ్చింది. అయితే ఈ నిధులను అక్రమంగా

మిగతా 12 లో



## కారులో కుక్కతో పార్లమెంట్‌కు రేణుకాచౌదరి

### అభ్యంతరం చెప్పిన బిజెపి ఎంపిలు

**న్యూఢిల్లీ,డిసెంబర్1ప్రజా ఎన్‌కౌంటర్**

పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజైన సోమవారంనాడు ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి కారులో ఒక కుక్కను పార్లమెంటు ప్రాంగణానికి తీసుకువచ్చారు. ఇది గమనించిన భద్రతాసిబ్బంది ఆ కుక్కను తిరిగి ఆమె నివాసానికి పంపేశారు. దీనిపై బీజేపీ విమర్శలు గుప్పించింది. ఇది ఎంపీలకు ఇచ్చిన ప్రత్యేక అధికారాలను దుర్వినియోగం చేయడమమే అవుతుందని విమర్శించింది. అయితే దీనిపై రేణుకా చౌదరి ఘాటుగా స్పందించారు. 'ఒక మూగజీవి కారులో ఉంటే వారికి ఎందుకు అంత ఇబ్బంది? దీనిపై ఏదైనా చట్టం ఉందా? నేను వస్తుండగా దారిలో ఒక స్కూటరు, కారు ఢీకొన్నాయి.



## 9 వేల ఎకరాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం

### హిల్ట్ పాలసీ పేరుతో వేలకోట్ల కుంభకోణం

### గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన బిజెపి

### ప్రభుత్వ అక్రమాలకు నిరసనగా 7న ధర్నా

**హైదరాబాద్,డిసెంబర్1ప్రజా ఎన్‌కౌంటర్**

హిల్ట్ పాలసీ పేరుతో రూ.వేలకోట్ల కుంభకోణం జరుగుతోందని గవర్నర్‌కు బిజెపి ఫిర్యాదు చేసింది. తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం గవర్నర్‌ను కలిసింది. అక్రమాలు జరగకుండా చూడాలని వినతిపత్రం అందజేసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, ఎన్వీ సుభాష్ తదితరులు ఉన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. 'హిల్ట్ పాలసీ ద్వారా అక్రమాలు చేసేందుకు

మిగతా 12 లో

### 11 ఏళ్లుగా ప్రభుత్వం

## అణచివేత ధోరణి

- గత సమావేశాల్లో హడావిడిగా 12 బిల్‌లు ఆమోదం
- ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ విపక్షనేత ఖర్గే
- ధన్‌కడ్‌కు ఉచిత వీడ్కోలు దక్కలేదని రాజ్యసభలో ప్రస్తావన
- ఖర్గే వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ,డిసెంబర్1ప్రజా ఎన్‌కౌంటర్**

పార్లమెంటరీ మర్యాదలను, పార్లమెంటరీ వ్యవస్థను గత 11 ఏళ్లుగా ప్రభుత్వం అణిచివేస్తూనే ఉందని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. గత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులు హడావిడిగా ఆమోదించారని, కొన్ని బిల్లులు కేవలం 15 నిమిషాల్లో ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించారని గుర్తుచేశారు. జీఎస్టీ, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, రైతు వ్యతిరేక చట్టాలు పార్లమెంటు ద్వారా ప్రభుత్వం బుల్డోజింగ్ చేసిన బిల్లులని ఆక్షేపణ తెలిపారు.పరాజయాన్ని అంగీకరించే మనసు ప్రతిపక్షాలకు లేదని, వాళ్లు వ్యూహం మార్చుకుంటే కొన్ని 'టిప్స్' ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని, సభా సమయాల్లో మాత్రం డ్రామాలు వద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. శీతాకాల సమావేశాల తొలి రోజే పార్లమెంటు ముందున్న కీలక అంశాల గురించి మోదీ ప్రస్తావించే బదులు నాటకీయ ప్రసంగం సాగించారని ఖర్గే తప్పుపట్టారు.

అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం
ప్రజా ఎన్‌కౌంటర్
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## అప్పులు తీర్చే మార్గాలు ఏవీ !

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి కొత్తంగా రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడి దాదాపు పుష్కరకాలం కావస్తోంది. రెండు రాష్ట్రాల్లో ఇద్దరు సిఎంలు, కొన్ని పొలిటికల్ పదవులు, డిజిపిలు, సిఎస్‌లు ఏర్పడ్డా ఈ రెండు రాష్ట్రాల్లో సాధించిన అభివృద్ధి శూన్యం. ఉమ్మడి ఎపిగా ఉన్ననాటికి నేటికి..సాధించిన అభివృద్ధి ఏదయినా ఉందంటే అది అప్పులు మాత్రమే. రాజకీయ నేతలకు పాలన చేతగాకపోవడం వల్ల రెండు తెలుగు రాష్ట్రాలు దాదాపు 15లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయాయి. ఈ అప్పులు ఏ అభివృద్ధికి తార్కాణమో పాలకులు చెప్పాలి. దీనికి ఎవరు బాధ్యులో చెప్పాలి. ఉచిత పథకాలతో రాష్ట్రాలను దివాళా తీయిస్తున్న పాలకుల తీరు వల్ల రాష్ట్రాలు ఎప్పటికీ అభివృద్ధి చెందవు. ప్రజలు కడుతున్న విలువైన ట్యాక్స్ మొత్తాలను ఇలా దుబారా చేయడం ఎంతవరకు న్యాయమో ప్రజలే ఆలోచన చేయాలి. ఎంతకాలమీ ఉచిత పథకాలు ఇస్తారో చెప్పాలి. దీనిని ఏ రకమైన అభివృద్ధి అంటామో కూడా తెలపాలి. ఎందుకంటే రోడ్లు వేయడానికి నిధులు లేవు. అభివృద్ధి పనులకు నిధులు లేవు. సకాలంలో జీతాలు, పెన్షన్లకు నిధులు లేవు. స్కూళ్లు, వైద్యశాలలు కునారిల్లుతున్నాయి. పన్నులు మాత్రం దండిగా వసూలు చేస్తున్నారు. దక్షుడు లేని ఇంటికి పదార్థ వే లక్షలు వచ్చినా..అన్న శతకకారుడి పద్యం ఇప్పుడు ఈ రెండు తెలుగు రాష్ట్రాలకు బాగా సరిపోతుంది. కిలో రూపాయికే బియ్యం, పెన్షన్లు, ఉచితబస్సు, ఉచిత విద్యుత, ఉచిత సిలిండర్, ఉచితంగా ఇళ్లు..ఇలా ఇంచుమించుగా ఇలాంటి పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అమలవుతున్నాయి. ఇదే అభివృద్ధిగా చెబుతూ గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. పెన్షన్లు పంచడానికి ఎపిలో సిఎం చంద్రబాబు హెలికాప్టర్ వేసుకుని తిరుగుతున్నారు. ఇంతదండగ మారి ఖర్చు ఎందుకో బాబు చెప్పాలి. హెలికాప్టర్ ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. ఇక తెలంగాణలో పదేళ్ల కేసిఆర్ పాలన అప్పులకుప్పగా నిలిచింది. వాటిని సరిచేసుకుని అభివృద్ధి చేసుకుంటూ పోవాల్సిన రేవంత్ సర్కార్ కూడా ఉచిత పథకాలను రద్దు చేయలేకపోతున్నది. ఓట్లు పోతాయన్న భయంతో ఈ పథకాలు కొనసాగిస్తున్నారు. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడమే పెద్ద దగా అనుకుంటే ..సన్నబియ్యం ఇవ్వడం పెద్ద సంస్కరణగా చెప్పకుంటున్నారు. ఇక దీనిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఇటీవల కేంద్రానికి సిఎం రేవంత్ సూచించారు. ఇలాంటి పథకాలు ప్రజలు సోమరులై, ఇళ్లల్‌ఓ కూర్చుని పనులకు పోకుండా ఉంటున్నారు. గ్రామాల్లో లేబర్ కావాలన్నా దొరకడం లేదు. వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదు. ఇవన్నీ తెలిసిన విషయాలే అయినా ఎవ్వరూ పెద్దగా చర్చించడం లేదు. ఇకపోతే రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా, ఈ విజన్ పాలసీ లక్ష్యాలు, ప్రణాళికలపై చర్చిస్తున్నారు. నిజానికి మిగులు ఆదాయం లేకుండా, అప్పులను ఎలా తీర్చాలో తెలప కుండా, ఉచిత పథకాల నుంచి గట్టెక్కడం ఎలాగో చెప్పకుండా తెలంగాణను 2037 వరకు 1 ట్రిలియన్ ఎకానమీగా మారుస్తామని ప్రకటించడం దారుణం. అంతేనా అంటే ప్రజలను మభ్య పెట్టడం తప్ప మరోటి కాదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సిఎంలు ఇద్దరూ అప్పులను తీర్చేందుకు ఉపాయాలు కోరడం లేదు. అప్పుల ఊబినుంచి బయటపడే ప్రయత్నం చేయడం లేదు. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా ఎదగాలన్నదే మా తుది లక్ష్యం అని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా ప్రకటించుకుంది. ఈ లక్ష్యాలను సాధించేందుకు వీలుగానే మేము తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ పాలసీని రూపొందిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళికలో ముఖ్యంగా సంక్షేమం, అభివృద్ధి సమానంగా ఉండేలా చూస్తున్నామని, వాటి మధ్య సమతుల్యతను కొనసాగించాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఈ విజన్ డాక్యుమెంట్ నాలుగు కోట్ల మంది ప్రజల భవిష్యత్తుకు సంబంధించినదని పేర్కొంటు న్నారు. దాని రూపకల్పనలో విస్తృత ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని వెల్లడించారు. దాదాపు 4 లక్షల మంది ప్రజల సూచనలు, ముఖ్యంగా యువకుల అభిప్రాయాలు, సూచనలు తీసుకున్నా మని చెప్పారు. అంతేకాకుండా, అన్ని రంగాల్లోని మేధావులు, నిపుణులతో ఇప్పటివరకు దాదాపు 70 సమావేశాలు ఏర్పాటు చేశామని, అందరి అభిప్రాయాలను తీసుకున్న తరువాతే విజన్ డాక్యుమెంట్‌ను తుదిరూపు ఇస్తున్నామని తెలిపారు. మూడు ట్రిలియన్ ఎకానమిని ఎలా సాధ్యం చేయాలి అనే అంశాలపై ఇప్పటికే తమ బృందం విస్తృత కసరత్తు చేసిందని వివరించారు. ఈ విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 8, 9 తేదీల్లో జరగబోయే గ్లోబల్ సమ్మిట్‌లో అధికారికంగా ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. పెట్టుబడులతో పాటు, కీలకమైన సలహాలు ఇవ్వడానికి చాలా మంది పారిశ్రామిక వేత్తలు ఈ గ్లోబల్ సమ్మిట్‌కి వస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు తెలియజేశారు. అయితే గ్రోత్ ఎలా ఉన్నా..ప్రస్తుతం ప్రభుత్వాలు నడపడానికే కనాకష్టంగా ఉంది. ఈ క్రమంలో తెలంగాణలో విలువైన ప్రభుత్వ ఆధీనంలోని భూములను తెగనమ్ము తున్నారు. భవిష్యత్ అవసరాలకు భూములు లేకుండా చేస్తున్నారు. ఎపిలో పోలవరం ఇంకా పూర్తి కాలేదు. జగన పోతూపోతూ ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. రాజధాని అమరావతికి ఇంకా భూసేకరణ చేస్తున్నారు. లక్ష ఎకరాలు టార్గెట్‌గా బాబు అడుగులు వేస్తున్నారు.

# నంబాలలో జరిగిన చిన్నారి హత్య కేసు చేధించినిందితుల అరెస్ట్ చేసిన పోలీసులు

**జన్నారం1 డిసెంబర్ ప్రజా ఎన్‌కౌంటర్**

రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోగల మంచిర్యాల జోన్ దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధి బాలిక మిస్సింగ్, హత్య కేసు ఛేదించడం లో రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వుల మేరకు, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు, మంచిర్యాల ఏసీపీ ఆర్ . ప్రకాష్ ఆధ్వర్యం లో నాలుగు బృందాలు సీఐ లక్షెట్టిపేట రమణమూర్తి , ఎస్ ఐ దండేపల్లి తాహేశీనుద్దీన్,లక్షెట్టిపేట సురేష్, ఎస్ ఐ జన్నారం అనూష లఆధ్వర్యంలో టీమ్ దర్యాప్తు లో భాగంగా నవంబర్27న ఉదయం బాధితురాలి శవం కొక్కెర బావిలో తేలిందని తెలియగా శనిగారపు బాపు ఉపారపు సతీష్ ఫోన్ మాట్లాడుకొని కలిసి దూరంగా ఎక్కడికైనా పారిపోదామని వాళ్ళు ఇద్దరు ద్వారకా గ్రామ శివారులో కలుసుకొని వారి యొక్క మోటార్ సైకిళ్ళ పై మాదాపూర్ నుండి మ్యాదరిపేట వైపు వచ్చేటప్పుడు సోమవారంఅనగా డిసెంబర్ 1న మాదాపూర్ లోని శ్రీ సిద్ధి వినాయక హనుమాన్ టెంపుల్ మాదాపూర్ రోడ్డు వద్ద పోలీస్ వారు పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించి అరెస్ట్ చేశారు.నిందితుల వద్ద నుండి 2 మొబైల్ ఫోన్లు, 2 మోటార్ సైకిళ్ళు, బట్టలు, 2- ఖాళి క్వార్టర్ మద్యం సీసాలు, హుల్కీ పుల్కీ చిప్స్ పాకెట్ బాధితురాలి 2 గాజులు, ఒక పట్టాగొలుసు స్వాధీనం చేసుకోవడం జరిగింది. వివరాల లోకి వెళితే భారత చెందిన శనిగారపు బాపూ ,ఉపారపు సతీష్ ఏ సత్తయ్య దండేపల్లి మండలం అంబాల గ్రామం మంచిర్యాల జిల్లా. మీరు ఇరువురుముద్దాయిలు నంబాల గ్రామ ఎస్ సికాలనీ కి చెందిన వారు. బ్యాండ్ పని చేసుకుంటూ జీవిస్తారు. శనిగారపు బాపు కి 20 సం ల క్రితం పెళ్లి జరిగినది. సుమారు 06 సం ల క్రితం అతని భార్య చనిపోయింది. తన కూతురు కొడుకు కూడా అతన్ని వధిలేశారు. ఉపారపు సతీష్ అనునతనికి కూడా గత 5 సం సం ల క్రితం పెండ్లి జరిగి, పెండ్లి అయిన 2 సంసం. ల తర్వాత అతనికి తన బార్యతో విడాకులు



అయినది. నవంబర్24రోజున శనిగారపు బాపు, ఉప్పారపు సతీష్ ఇద్దరు కలిసి బయట చింత చెట్టు కింద ఆడుకుంటున్న బాదితురాలిని నోరు మూసి ఎత్తుకొని దగ్గర లో పత్తి చేనులో క్రింద పండబెట్టి ఒకరి తర్వాత ఒకరు బాధితురాలిని బలవంతగా అనుభవించినారు. బాధితురాలితో బలవంతగా కామ కోరిక తీర్చుకున్న తర్వాత బాధితురాలిని బయటకు వస్తే ఎవరకైనా చెప్పుతదనే భయంతో ఆమెను చంపాలనే ఉద్దేశ్యంతో ఆమె గొంతు దగ్గర గట్టిగా నొక్కి, తర్వాత ప్రక్కనే ఉన్న కొక్కెర హరీష్ వాళ్ళ యొక్క వ్యవసాయ బావిలో పడేసినారు. ఈ కేసు ఛేదించడం లో కృషి చేసిన మంచిర్యాల ఏసీపీ ఆర్ . ప్రకాష్ ఆధ్వర్యం లో నాలుగు బృందాలు సీఐ లక్షెట్టిపేట రమణమూర్తి గారు , ఎస్ ఐ దండేపల్లి తాహేశీనుద్దీన్,లక్షెట్టిపేట సురేష్, ఎస్ ఐ జన్నారం అనూష , హెడ్ కానిస్టేబుళ్లు గౌస్, గంగ నాయక్, వసంత్, జహీర్, ఆనంద్ మరియు కానిస్టేబుళ్లు లను డీసీపీ గారు అభినందించారు.

# సీఎం సభతో ప్రజల్లో జోష్ రావాలి

**అభివృద్ధి ఎజెండాగా ప్రత్యేక కార్యాచరణ**

**రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**సభకి ఏర్పాట్లు వేగవంతం చేయాలని అధికారులకు దిశా నిర్దేశం**

**హుస్నాబాద్ డిసెంబర్ 01ప్రజా ఎన్‌కౌంటర్**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కు ఈనెల 3న సీఎం రానున్న సందర్భంగా హుస్నాబాద్ లో నిర్వహించనున్న సభాస్థలిని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యవేక్షించారు. సభకు ఏర్పాట్లు వేగవంతం చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ....తెలంగాణ లో అభివృద్ధి చేయడానికి కోర్ అర్బన్ , రీజియన్ ,సెమీ అర్బన్ రీజియన్ ,రూరల్ ఏరియా లుగా విభజించి ప్రత్యేక ప్రణాళికల ద్వారా ఒక విజన్ తో ముందుకు పోతున్నామని అన్నారు.గ్రామాల్లో ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా మేము ఏర్పాట్లు చేయడం లేదు కానీ వాళ్ళే వస్తున్నారని వెల్లడించారు.హుస్నాబాద్ సభలో ముఖ్యమంత్రి విద్యా, వ్యవసాయం ,ఉపాధి కి ప్రాధాన్యత ఇస్తారని, అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారని, సీఎం పర్యటన హుస్నాబాద్ మరింత అభివృద్ధి చెందడానికి తోడ్పడుతుందన్నారు.ఎన్నికల కోడ్ ఇబ్బంది లేకపోతే గౌరవెల్లి భూ నిర్వాసితులకు చెక్కులు పంపిణీ చేస్తామని చెప్పారు.రాహుల్ గాంధీ పై నేషనల్ హెరాల్డ్ కేసులో ఎఫ్ ఐ ఆర్ దాఖలవడం దురదృష్టకరమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.బీజేపీ అనుబంధ సంఘాలుగా వ్యవహరిస్తున్న ఈడి ఎన్ఫోర్స్మెంట్ వేధింపులకు గురి చేయడంలో దిట్ట అని,బీజేపీ వైఫల్యాలు ముందుకు వచ్చినప్పుడు పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరిగినప్పుడు ప్రతిపక్ష నాయకుడిపై ఇలా ఈడి కేసులతో వేధిస్తుంటారని,ఇలా వేధించడం వల్ల చర్చ జరగకుండా చూడాలని చూస్తున్నారని మండిపడ్డారు.ఓట్ల సవరణలు తొలగింపు పై ప్రశ్నిస్తారని ,12 సంవత్సరాల వైఫల్యాల పై ప్రశ్నిస్తారని, పార్లమెంట్ సమావేశాలు జరుగుతుంటే హాజరు కాని ప్రధాని పై ప్రశ్నిస్తారని ,రఫెల్ కుంభకోణం , కశ్మీర్ దాడుల నేపథ్యంలో అసమర్థ పాలన ,బీహార్ పేలుళ్లు ,హిందుత్వ ప్రేరేపిత రాజకీయ దాడులపై ధైర్యంగా పార్లమెంట్ లో అధికార పక్షాన్ని రాహుల్ గాంధీ నిలదీయడం వల్లే ఇలా కేసులతో వేధింపులు చేస్తున్నారని అన్నారు. బీజేపీ తో కలిసి ఉండి ఎంత అవినీతి చేసినా నేతలకు తప్పులేదు. వాళ్ళని ప్రశిస్తే ఇలా కేసులతో వేధిస్తున్నారని,ప్రజాస్వామ్యాన్ని ,రాజ్యాంగాన్ని కాపాడుతున్న రాహుల్ గాంధీ పై ఈడి





వేధింపులు సరైంది కాదని తెలిపారు.మారుతున్న కాలానికి అనుగుణంగా అభివృద్ధి చేస్తూ రైజింగ్ తెలంగాణతో అన్ని అంశాలు, ప్రణాళికలతో ముందుకు పోతున్నట్లు పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు 2020 విజన్ తో వెళ్ళారు. కేసీఆర్ చెప్పిన బంగారు తెలంగాణ విజన్ చెప్పిన కవిత అన్నట్టు బంగారు తెలంగాణ వాళ్ళ ఇంటి నుండి బయటకు రాకపోవచ్చు గాని,ఇప్పుడు కాంగ్రెస్ 2047 విజన్ తో ముందుకు పోతున్నామని, దేశానికి తెలంగాణ దిక్సూచి లాగ అభివృద్ధి చెందేలా కార్యాచరణ తీసుకుంటున్నట్లు చెప్పారు.

# గత పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో తీవ్రనిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

పాలమూరుకు ఏది కావాలన్నా చేసి మీ రుణం తీర్చుకుంటానని అన్నారు. దశాబ్దాలుగా పాలమూరు జిల్లా కరవు, వలసలకు మాత్రమే పేరు పొందింది. ఇక్కడి నుంచి ఎంపీగా చేసిన మాజీ సీఎం కెసిఆర్ కూడా ఈ జిల్లాకు ఏం చేయలేదు. ప్రాజెక్టులను పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. ఈసారి పాలమూరు బిడ్డను ప్రజలు గెలిపించి అధికారం కట్టబెట్టారని సీఎం రేవంత్ అన్నారు. కేసీఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ఆ అప్పులు తీరుస్తూనే.. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. అభివృద్ధిని అడ్డుకునే వాళ్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించొద్దు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవాళ్లను గెలిపిస్తే.. గ్రామం అభివృద్ధి చెందదు. మంత్రుల వద్దకు వెళ్లి గ్రామానికి నిధులు అడిగే నేతలను సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలి. ఈసారి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించాం. పదేళ్లు నిర్లక్ష్యానికి గురైన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాం. ఈ ప్రాజెక్టుపై కేసులు వేసి అడ్డుకున్నారు. రైతులు నష్టపోవద్దని ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇచ్చేందుకు ముందుకొచ్చాం. పాలమూరు జిల్లాలో కృష్ణానది పారుతున్నా.. ఇక్కడి నేలకు నీళ్లు అందలేదు. మాయగాళ్ల మాటలు విని.. ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు. ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌లను ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నాం అని సిఎం రేవంత్ అన్నారు. మక్తల్ పర్యటనలో భాగంగా రూ.200 కోట్లతో సమీకృత గురుకుల పాఠశాల సముదాయ భవనాలు, మక్తల్- నారాయణపేట మధ్య నాలుగు లైన్ల రోడ్డు, మక్తల్‌లో క్రీడాభవనం తదితర అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అంతకుముందు వనపర్తి జిల్లా ఆత్మకూరులో పర్యటించారు. రూ.151.92 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జూరాల దిగువన హైలెవల్ వంతెన నిర్మాణం, ఆత్మకూరు మున్సిపాలిటీలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన తర్వాత కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పట్టించుకోలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లాకు తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే.. ఆటోడ్రైవర్లను మాజీ మంత్రి కేటీఆర్ అండ్ కో రెచ్చగొట్టి తమ మీదకు పంపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు సీఎం.

మొదటిపేజీ తరువాయి

# 9 వేల ఎకరాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం

ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 9 వేల ఎకరాలను రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు యత్నిస్తోంది. అప్పటి, ఇప్పటి ధరలు పోల్చి చూస్తే అక్రమాలు తెలుస్తున్నాయి. కోకాపేటలో భూముల ధర ఇటీవల ఎంత పలికిందో మనం చూశాం. ఈ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 7న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తాం. జీహెచ్‌ఎంసీ విస్తరణలోనూ అనేక కుట్రలు ఉన్నాయని నేతలు ఆరోపించారు.అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. హిల్ట్ పాలసీని వ్యతిరేకిస్తూ గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇండస్ట్రియల్‌కు కేటాయించిన భూములను హిల్ట్ పేరుతో రియల్ ఎస్టేట్‌గా మారుస్తూ కోట్ల రూపాయలు అవకతవకలకు తెర లేపుతున్నారని ఆరోపించారు. మార్కెట్ వాల్యూ కన్నా తక్కువ రేట్లకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. 6 లక్షల 30 వేల కోట్ల విలువైన 9292 వేల ఎకరాల భూములను కేవలం 5 వేల కోట్లకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందా..? పరిపాలన చేస్తుందా.. అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందింది కాబట్టే ఇండస్ట్రియల్ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టి లబ్ది పొందుతున్నారని వ్యాఖ్యలు చేశారు. హిల్ట్‌కు వ్యతిరేకంగా ఈనెల 7న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా చేపట్టబోతున్నామని ప్రకటించారు. హిల్ట్ పాలసీపై ప్రభుత్వంతో చర్చిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు వెల్లడించారు.

# శ్రీలంకపై విరుచుకుపడ్డ దిత్వా తుఫాన్

**ఇప్పటికే 334 మంది మృతి...మరో 370మంది గల్లంతు**

**కొలంబో,డిసెంబర్1ప్రజా ఎన్‌కౌంటర్**

దిత్వా తుపాను శ్రీలంకపై విరుచుకుపడింది. తుపాను ప్రభావంతో ఇప్పటివరకు సుమారు 334మంది మరణించినట్లు అధికారులు సోమవారం తెలిపారు. మరో 370మంది గల్లంతయ్యారని అన్నారు. బదుల్లా, నువారా, ఎలియా మరియు మటలే జిల్లాల్లో ఆదివారం అధిక సంఖ్యలో మరణాలు నమోదయ్యాయని అన్నారు. కొండచరియలు విరిగిపడటంతో పలువురు శిథిలాల కింద చిక్కుకుపోయారని అన్నారు. సుమారు 11లక్షలకు పైగా ప్రజలు తుపానుతో తీవ్రంగా ప్రభావితమయ్యారని, సుమారు 2 లక్షలమంది నిరాశ్రయులయ్యారని విపత్తు నిర్వహణ కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. దిత్వా తుఫాను కారణంగా శ్రీలంకలోని అనేక జిల్లాల్లో రికార్డు స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయని, పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయని వెల్లడించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నిషేధిత జోన్‌లో చిక్కుకున్న ప్రయాణికులను తరలించేందుకు తమ హెలికాప్టర్లు శ్రీలంక అధికారులతో కలిసి హైబ్రిడ్ రెస్క్యూ మిషన్ చేపట్టాయని భారత వైమానిక దళం తెలిపింది. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకె తెలిపారు.

# మక్తల్ మండల బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులకు నమస్కారం

మక్తల్ డిసెంబర్ 01 (ప్రజా ఎన్కౌంటర్)



నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలోని చిట్టెం రామన్న నివాసంలో రేపు అనగా ది02-12-2025 మంగళవారం నాడు ఉదయం 10:30 నిమి,లకు జరిగే స్థానిక సంస్థల ఎన్నికల" సందర్భంగా సమావేశం నిర్వహించడం జరిగింది. సమా వేశానికి.... మన ప్రియతమా నాయకుడు తెలంగాణ రాష్ట్ర మక్తల్ తొలి శాసనసభ్యులు చిట్టెం రాంమోహన్ రెడ్డి" అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగింది. కావున ఇట్టి సమావేశానికి మక్తల్ మండలంలోని అన్ని గ్రామాల మాజీ సర్పంచ్లు,మాజీ వార్డు మెంబర్లు,ముఖ్యనాయకులు,కార్యకర్తలు బి ఆర్ ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయగలరని మనవి.

# కాంగ్రెస్‌కు షాక్

## : తీన్మార్ మల్లన్న 'టీఆర్పీ'లో చేరిన..!

### సోషల్ మీడియా యోధురాలు నీరజ గౌడ్..

### టీఆర్పీలో చేరిక: బీసీల హక్కుల కోసం సేవలు..

హైదరాబాద్ ప్రజా ఎన్ కౌంటర్ డిసెంబర్ 01:

తెలంగాణ రాజకీయాల్లో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగంలో చురుకైన పాత్ర పోషించిన నీరజ గౌడ్, బీసీ హక్కుల కోసం పోరాడుతున్న నాయకుడిగా పరిగణించబడుతున్న తీన్మార్ మల్లన్న నాయకత్వంలోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ)లో చేరారు. బీసీల పట్ల అధికార పార్టీల వైఖరిని గమనించి, సామాజిక న్యాయం కోసం ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

**రాజకీయ మార్పునకు కారణాలు: బీసీల ప్రయోజనాలే కీలకం**

కాంగ్రెస్ పార్టీలో బీసీ వర్గాలకు జరుగుతున్న అన్యాయాలు, అధికార పార్టీల రాజకీయాలపై నీరజ గౌడ్ దృష్టి సారించారు. ఈ పరిస్థితుల నడుమ బీసీలకు నిజమైన ప్రాతినిధ్యం ఎక్కడ లభిస్తుందో ఆమె అంచనా వేసుకున్నారు. బీసీల ఆత్మగౌరవం కోసం ఒక నాయకుడు చేస్తున్న పోరాటం, బీసీలపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే ధైర్యం నీరజ గౌడ్‌ను ప్రభావితం చేశాయి.

**టీఆర్పీ వైపు అడుగులు: సామాజిక న్యాయ సంకల్పం**

బీసీలపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తున్న స్వరం, బీసీలకు న్యాయం చేయాలనే సంకల్పం, మరియు బీసీ సమాజం ఏకమవుతున్న తీరు నీరజ గౌడ్‌ను టీఆర్పీ వైపు ఆకర్షించాయి. బీసీల రాజ్యాధికారం లక్ష్యంగా పనిచేస్తున్న ఈ పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలు ఆమె నిర్ణయాన్ని ప్రభావితం చేశాయి.

**టీఆర్పీలో చేరిక: బీసీల హక్కుల కోసం సేవలు**

ఒక నాయకుడి సమక్షంలో పార్టీ కండువా కప్పుకొని, నీరజ గౌడ్ అధికారికంగా టీఆర్పీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె బీసీ హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం, తెలంగాణలో నిజమైన రాజ్యాధికారం సాధించడం కోసం తన సేవలను అందిస్తానని తెలిపారు.



# ఐఈఎల్టిఎస్ శిక్షణ కోసం దరఖాస్తు చేయాలి

ప్రజా ఎన్‌కౌంటర్ న్యూస్ ముస్తాబాద్

రాష్ట్రంలోని బిసి, ఇతర విద్యార్థులకు విదేశాల్లో అత్యున్నత విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల అవకాశాలను, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇవ్వబడుతున్న అంతర్జాతీయ ఉపకార వేతనాలు పొందడం లక్ష్యంగా బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్మాణాత్మక అవ గాహనా తరగతులు, ఐఈఎల్టిఎస్ శిక్షణా ప్రారం భించడం జరుగుతుందని డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రులైన సిరిసిల్ల జిల్లా లోని ఉద్యోగ లేదా నిరుద్యోగ అభ్యర్థులు ఈనెల 21 లోపు టి.జి.బి.సి.స్టడీ సర్కిల్ వెబ్సైట్ www.tgbcstudycircle.cgg.gov.in%µµ ద్వారా ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలి. మరింత సమాచారం కొరకు ఈ నెంబర్ కు పని వేళలో సంప్రదించగలరు ఫోన్ నంబర్లు 40-24071178 08723-223004 సంప్రదించాలి.

# నారాయణపేట్ జిల్లా మక్తల్ లో ప్రజా పాలన

## - ప్రజా విజయోత్సవాలు బహిరంగ సభ

## ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మక్తల్ డిసెంబర్ 01 (ప్రజా ఎన్కౌంటర్)



హాజరైన మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు

మంత్రి వాకిటి శ్రీహరి

కొన్ని దశాబ్దాలుగా మాటలకే మక్తల్ అభివృద్ధి పరిమితం అయింది.

ప్రాజెక్టులు కట్టాలని ఈ ప్రాంతానికి నీళు ఇవ్వాలని ఎన్ని రాస్తారోకోలు చేసిన ఒక్క అడుగు ముందుకు పడలేదు

పక్కనే కృష్ణమ్మ పారుతున్న వ్యవసాయానికి నీళ్లు లేక విలవిలలాడే పరిస్థితి ఇక్కడ ఉండేది,

మక్తల్ నుండి వేరే రాష్ట్రాలకు వలసపోయే పరిస్థితి ఇక్కడ ఉండేది.

కానీ మన ప్రియతమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాంతానికి నీరందించాలంటే నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంతో సాధ్యం అవుతుందని ఆలోచించి ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

అప్పుడు నేను ముఖ్యమంత్రి దగ్గరికి వెళ్ళి మక్తల్ నుండి నది ప్రవహిస్తుంది కాబట్టి ఈ ప్రాజెక్ట్ పేరు మక్తల్ - నారాయణపేట కొడంగల్ పేరు పెట్టాలనగానే ఒక్క నిమిషం ఆలోచించకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మక్తల్ - నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంగా పేరు మార్చారు.

మక్తల్,నారాయణపేట,కొడంగల్ ప్రాంతాలకు 5వేల కోట్లతో లక్ష ఎకరాలకు నీళ్లు ఇచ్చిన దైవం,అపరభగీరథుడు, మరో సర్ అర్థన్ కాటన్, మరో రాజశేఖర్ రెడ్డి మన రేవంత్ రెడ్డి ఊహించని విధంగా ఇంత త్వరగతిన ప్రాంత అభివృద్ధికి,ప్రాజెక్ట్ పూర్తి చేసి లక్ష ఎకరాలకు నీళ్ళు ఇచ్చేందుకు నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని సందర్భంగా తెలియచేస్తున్నాను.

అంతేకాకుండా దామోదర రాజనర్సింహ గారు 50కోట్ల రూపాయలతో మక్తల్ నియోజకవర్గానికి హాస్పిటల్ మంజూరు వారికి కూడ ధన్యవాదములు

మక్తల్ నుండి నారాయణపేట వెళ్ళే మార్గంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండేది.50ఏళ్లుగా ఎవరు ఈ రోడ్ గురించి ఆలోచించలేదు

కానీ నేను వెళ్ళి అడగగానే ఒక్క నిమిషం ఆలోచించకుండా ఆర్%డ%బి మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 210కోట్లతో 4లైన్ల రోడ్ మంజూరు చేసినందుకు వారికి కూడ ధన్యవాదములు తెలియచేస్తున్నాను.

పర్యాటక,దేవాలయల అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు జూపల్లి కృష్ణారావు కూడ

ధన్యవాదములు తెలియచేస్తున్నాను

మక్తల్ ప్రజలు ఇచ్చిన ఈ అవకాశంతో మక్తల్ అభివృద్ధి కోసం భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకుని వచ్చి మరింత అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా మక్తల్ ప్రజలకు హామీ ఇస్తున్నాను.





# కరీంనగర్ జిల్లా ప్రజలు టీఆర్పీలో భారీగా చేరికలు

## గూడెల్లి రాకేష్ ఆధ్వర్యంలో చేరిన యువత.

## కండువాలు కప్పి ఆహ్వానించిన రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా.

## ప్రతి గడపకు టీఆర్పీ చేరేలా కృషి చేయాలని అఖిల్ పాషా సూచన.

కరీంనగర్ ప్రజా ఎన్ కౌంటర్ డిసెంబర్ 01:



కరీంనగర్ జిల్లా టీఆర్పీ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ కరీంనగర్ జిల్లా యూత్ అధ్యక్షులు గూడెల్లి రాకేష్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల యువ నాయకులు భారీగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో చేరారు. నూతన సభ్యులకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేసిన అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా నూతన సభ్యులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి 96 శాతం ఉన్న బీసీ ఎస్సి ఎస్టీ మైనారిటీలు 4 శాతం ఉన్న అగ్రవర్ణాల జెండాలు మోసి, వారికి జేజేలు కొట్టి వారి కింద బానిసగా బ్రతికే దిశగా అగ్రవర్ణాలు కుట్రలు చేశారన్నారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు ఏ రాజకీయ పార్టీ న్యాయం చేయదని హితవు పలికారు. అగ్రవర్ణాల పెత్తనాన్ని అణిచివేసి బీసీ రాజ్యాధికారాన్ని సాదించుకోవాలంటే బీసీలకు ఒక సొంత పార్టీ ఉండాలనే సృజనాత్మక ఆలోచనతో తెలంగాణ రాష్టంలో ప్రజా గొంతుక ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న టీఆర్పీ పార్టీ ని అవిర్భవించారని అన్నారు. ఈ పార్టీలో మాజీలకు అవకాశం లేదని తజాలను మాత్రమే చేర్పించుకుంటామని తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్టంలో ఒక కొత్త రాజకీయ నాయకత్వాన్ని సృష్టిస్తామని తెలుపుతూ ఎస్సి, ఎస్టీ బీసీ మైనారిటీలు ముందుకు రావాలని ప్రధానంగా యువత భారీగా రాజ కీయాల్లోకి రావాలని పిలుపు నిచ్చారు. బీసీ రాజ్యాధికారం సాదించుకోవడం టీఆర్పీ పార్టీ తోనే సాధ్యమైతుందని తెలిపారు. మేమెంతో మాకంత అనే నినాదంతో ప్రజా క్షేత్రంలోకి వెళ్లి అగ్రవర్ణాల దోపిడీని అరికట్టాలని అందుకు గాను మీరంతా పార్టీ సైనికులై కష్టపడాలని తెలిపారు. పార్టీలో చేరిన నూతన సభ్యులు గోగుల మహేష్, కూన మహేందర్, ఇరగదిండ్ల వెంకన్న, కుంచెం రాజేష్, కొనతం ఉప్పలయ్య, కుంచం రాకేష్, శివరాత్రి సంతోష్, కొనతం మధుసూదన్, ఓర్సు రాజు, ఇరగదిండ్ల మహేందర్, కొనతం వెంకన్న, శివరాత్రి రాజు వీరందరూ పార్టీ బలోపేతానికి ముందు వరుసలో ఉండాలని అఖిల్ పాషా సూచన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, జిల్లా కార్యదర్శి చాంద్ పాషా, టౌన్ ప్రెసిడెంట్ అర్షత్, ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, జిల్లా యూత్ అధ్యక్షులు రాకేష్, టీఆర్పీ నాయకులు వాజిత్, గంగిపెల్లి సత్తిష్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.



# నామినేషన్ల స్వీకరణలో పొరపాట్లకు తావు ఉండకూడదు

## : కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

ప్రజా ఎన్‌కౌంటర్ న్యూస్ నిజామాబాద్, డిసెంబర్ 01 :

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికలకు సంబంధించి నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాలతో పాటు జక్రాన్పల్లి మండలంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం మోపాల్ మండలం కులాస్ పూర్, జక్రాన్పల్లి మండలం పడకల్ గ్రామ పంచాయతీల ఆకస్మికంగా సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, మొదటి అంకమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని అన్నారు. నామినేషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. రెండవ విడత నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైందని, మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరిస్తారని అన్నారు. చివరి రోజున ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నందున, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చివరి సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురవుతుందని, అందుకని అభ్యర్థులు ముందు జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని సూచించారు. ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.



# డిసిసి అధ్యక్షులుగా బాధ్యతలు లభించడం విశేషం

## : మహమ్మద్ షబ్బీర్ అలీ

ప్రజా ఎన్‌కౌంటర్ న్యూస్ నిజామాబాద్ బ్యూరో

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు లభించడం ఎంతో అపూర్వ అవకాశమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఆయన, పీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డి లతో కలిసి, సోమవారము నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నూతనంగా నియామకమైన డిసీసీ అధ్యక్షులు కాట్పల్లి నగేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ బాధ్యతల స్వీకరణ, అనంతరం లక్ష్మీ కళ్యాణ మండపంలో ప్రమాణ స్వీకార సభా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన మాటల్లో యథాతకంగా.. పార్టీకి కష్టపడ్డ వారికి పదవులు తప్పకుండా వస్తాయి. పదవులు ఆశించి, రాని వాళ్ళకు భవిష్యత్తులో మంచి అవకాశం కల్పిస్తాం. పార్టీ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారు పార్టీ సిద్ధాంతాలను, విలువలను, ఆశయాలను గౌరవిస్తూ, జిల్లాలో పట్టణంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలి. జిల్లాలోని ప్రతి కార్యకర్తను కలుపుకొని వారి సలహాలు, సూచనలు తీసుకోవాలి. పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయాలి. జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలి.అందరినీ కలుపుకొని అందరి సహకారంతో కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత ముందుకు తీసుకువెళ్లాలి ఎల్లవేళలా మా సహకారం మీకు ఉంటది అన్నారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ లు, జిల్లా చైర్మన్లు, నియోజకవర్గ బాధ్యులు పాల్గొన్నారు



# బాధితురాలికి తక్షణ సహాయం కింద 50,000 అందజేత

ప్రజా ఎన్‌కౌంటర్ న్యూస్ నిజామాబాద్ బ్యూరో

నిజామాబాద్ పట్టణంలోని 25 వార్డ్ కోటగల్లీలో ప్రమాదవశాత్తు జహీదా బేగం నివాస గృహం అగ్ని ప్రమాదానికి గురి అవగా, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పరామర్శించారు. తక్షణ సహాయం కింద షబ్బీర్ అలీ, 50వేల ఆర్థిక సహాయం చేశారు. పట్టణంలో ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తామని తెలిపారు.



# తెలంగాణ బీసీ సంఘాల ఆమరణ దీక్షకు టీఆర్పీ పార్టీ సంపూర్ణ మద్దతు

హైదరాబాద్ ప్రజా ఎన్ కౌంటర్ డిసెంబర్ 01:

తెలంగాణ బీసీ సంఘాల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వర్ గారికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. టీఆర్పీ పార్టీ హైదరాబాద్ ఇన్చార్జ్ భవన వెంకటేష్ మరియు కార్వాన్ నియోజకవర్గ ఇన్చార్జ్ టీవీఆర్ గారు బత్తుల సిద్దేశ్వర్‌ను కలిసి సంఘీభావం తెలిపారు.

### టీఆర్పీ నేతల పరామర్శ

ఈరోజు హైదరాబాద్‌లో దీక్షా శిబిరాన్ని సందర్శించిన టీఆర్పీ నాయకులు, సిద్దేశ్వర్ గారిని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. బీసీల హక్కుల సాధన కోసం ఆయన చేస్తున్న పోరాటానికి తాము అండగా ఉంటామని, టీఆర్పీ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ధైర్యం చెప్పారు.

### దీక్షకు మద్దతుగా పార్టీ కార్యకర్తలు

ఈ కార్యక్రమంలో టీఆర్పీ పార్టీ కార్యకర్తలతో పాటు ఇతర పార్టీ కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. అనిల్ కుమార్, శంకర్ బ్రోజీ, వెంకట్ స్వామి, బొమ్మల మైసయ్య, వెంకట్ స్వామి తదితరులు ఈ సంఘీభావ కార్యక్రమంలో భాగమయ్యారు. బీసీ సంఘాల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

### ప్రధాన డిమాండ్: బీసీ సమగ్ర కులగణన

బత్తుల సిద్దేశ్వర్ గారు తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు సమగ్ర కులగణన చేపట్టాలని ప్రధానంగా డిమాండ్ చేస్తూ ఆమరణ దీక్షకు దిగారు. గతంలో ఆయన చేసిన దీక్షకు కేంద్ర మంత్రి హామీ ఇవ్వడంతో ముగించినప్పటికీ, సమస్య పరిష్కారం కాకపోవడంతో తిరిగి నిరసన వ్యక్తం చేస్తున్నారు. బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలు కల్పించాలంటే కులగణన తప్పనిసరి అని ఆయన వాదిస్తున్నారు. ఈ న్యాయమైన పోరాటానికి వివిధ రాజకీయ పార్టీలు మరియు సామాజిక సంఘాల నుండి మద్దతు లభిస్తోంది.





# పాఠశాలలో గీతా జయంతి వేడుకలు

ప్రజా ఎన్‌కౌంటర్ న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలోని శాంభవి హై స్కూల్లో సోమవారం పాఠశాల చైర్మన్ రాజు బొట్ల, కరస్పాండెంట్ రవీన్ ప్రసాద్ ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు కృష్ణ సాయి భవద్గీత శ్లోకాలు పఠించగా, వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం భవద్గీత విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇంద్రాణి, వైస్ ప్రిన్సిపల్ మంజుల పాల్గొన్నారు.



# ఎయిడ్స్ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

## : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజా ఎన్‌కౌంటర్ న్యూస్, నిర్మల్ బ్యూరో, డిసెంబర్ 01.

ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. డిసెంబర్ 01 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుండి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది.జెడ్పీ కార్యాలయంలో కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు ఎయిడ్స్ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్థుల సహాయర్థమై జిల్లాలో ఎయిడ్స్ నిర్ధారణ, కౌన్సిలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి అధికంగా ప్రబలే అవకాశం ఉన్న ప్రత్యేక వర్గాలను గుర్తించి ఎప్పటికప్పుడు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. వ్యాధి గుర్తించిన బాధితులకు సత్వర చికిత్స అందించాలని తెలిపారు. జిల్లాలో ప్రసూతి మరణాల తగ్గింపులో కిందిస్థాయి సిబ్బంది మొదలుకొని అధికారులు చేపట్టిన చర్యలు అభినందనీయమని అన్నారు. గతంలో ఉన్న ప్రసూతి మరణాల కేసులను అమ్మరక్షిత వంటి వినూత్న కార్యక్రమాల అమలుతో, క్షేత్రస్థాయి సిబ్బంది చొరవతో ప్రసూతి మరణాలు గణనీయంగా తగ్గించగలిగినట్లు చెప్పారు. మున్ముందు ప్రసూతి మరణాల రహిత జిల్లాగా నిర్మాణం తీర్చిదిద్దేలా మరింత పట్టుదలతో పనిచేయాలని తెలిపారు. ర్యాలీ సందర్భంగా కళాజాత బృందాలు డప్పు పాటలతో ప్రజలకు ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఎంహెచ్ఓ రాజేందర్, డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక, డీఈవో భోజన్న, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ విజయవంతం చేయాలి

ప్రజా ఎన్‌కౌంటర్ ప్రతినిధి భూపాల్ పల్లి

భూపాల్ పల్లి జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ ను విజయవంతం చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఎం రాజేందర్ అన్నారు ఈ నెల 5 6 తేదీలలో పాత శాంతి నికేతన్ (బిట్స్ పాఠశాల )లో రెండు రోజుల పాటు నిర్వహించే ఇన్స్పైర్ సైన్స్ ఫేర్ విజయవంతం కోసం సైన్స్ ఫేర్ కన్వీనర్లు కో కన్వీనర్స్ తో సన్నాహక సమావేశం ను బిట్స్ స్కూల్ లో నిర్వహించారు ఇన్స్పైర్ ప్రాజెక్ట్స్ ఎక్సిబిట్స్ ప్రదర్శించాలని మొత్తం ఏడు అంశాలలో జూనియర్ సీనియర్ విభాగాల్లో నమోదు చెయ్యాలని ఆయా కమిటీల కన్వీనర్స్ కో కన్వీనర్స్ సమర్థవంతంగా పని చేసి విజయవంతం చేసి జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు ఈ సమావేశం లో జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి ఏ ఎం ఓ పింగిలి విజయ పాల్ రెడ్డి డి సి ఈ బి కార్యదర్శి చంద్ర శేఖర్ భూపాల్ పల్లి ఎం ఈ ఓ దేవా నాయక్ బిట్స్ పిన్సిపాల్ శ్రీనివాస్ చల్లా కిషన్ రెడ్డి ఆయా మండలాల ఎం ఈ ఓ లు గెజిటెడ్ హెచ్ ఎం లు టీచర్లు పాల్గొన్నారు




# భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ కు ఘన వీడ్కోలు

## కొత్తగూడెం బదిలీ సందర్భంగా

## సత్కరించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

ప్రజా ఎన్‌కౌంటర్ న్యూస్, నిర్మల్ బ్యూరో, డిసెంబర్ 01.

భైంసా అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న అవినాష్ కుమార్ కు కొత్తగూడెం బదిలీ అయిన సందర్భంగా, నిర్మల్ జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో నిన్న జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ… "అవినాష్ కుమార్ భైంసా సబ్ డివిజన్ ప్రాంతంలో అత్యంత నిబద్ధతతో, ప్రజలతో సాన్నిహిత్యంగా పనిచేశారు. భవిష్యత్తులో కూడా ఇదే క్రమంలో ఉత్తమ సేవలందించి పోలీసులు శాఖకు మరింత గౌరవం, మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నాను," అని తెలిపారు.అవినాష్ కుమార్ మాట్లాడుతూ.."ఎస్పీ మేడం నాకు ఎంతో మార్గదర్శనం చేశారు. మేడమ్ వద్ద పనిచేయడం ద్వారా అనేక విషయాలు నేర్చుకున్నాను. నేర్చుకున్న అనుభవాలను కొత్త బాధ్యతల్లోనూ కొనసాగించి, మరింత శ్రద్ధతో పనిచేస్తాను" అని తెలిపారు.ఈ వీడుకోలు సమావేశంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తో పాటు భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన, ఇన్స్పెక్టర్లు, ఆర్ ఐ లు,ఎస్ఐ లు, ఆర్ ఎస్ ఐ లు ఉన్నారు.



# అక్రమార్కులు జీవన్ రెడ్డి భరతం పడతాం

## : కాంగ్రెస్ ఇన్చార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి

ప్రజా ఎన్‌కౌంటర్ న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్

ఆర్మూర్ నియోజకవర్గంలో 10 సంవత్సరాలు అనేక అవినీతి అక్రమాలు చేసి ప్రజలను నానా వేధింపులకు గురిచేసిన మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి భరతం పడతామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ లో గల పివిఆర్ భవన్లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జీవన్ రెడ్డి అనేకసార్లు తన కాళ్లు మొక్కాడని ఆయన కోసం తాను 125 కోట్లనుంచి 150 కోట్లు నష్టపోయానన్నారు. మొరం, ఇసుక ఇప్పటికీ జీవన్ రెడ్డి అనుచరులైన మధు మరొక వ్యక్తి నిర్వహిస్తున్నాడని అన్నారు. నమ్మి వచ్చిన వారిని మోసం చేయడమేనైజమన్నారు. పది సంవత్సరాలు ఆర్మూర్ నియోజకవర్గంలోని ప్రజలకు బెదిరింపులు, ఇబ్బందులకు గురిచేసి ఆరేడుగురి తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడని, మున్సిపల్ కార్యాలయం ద్వారా 450 ఇండ్లకు అక్రమంగా ఇంటి నెంబర్లు ఇప్పించారనే ఆరోపణలు అవాస్తమన్నారు. ఒకవేళ కాంగ్రెస్ నాయకులు అక్రమంగా ఇంటి నెంబర్లు ఇప్పించినట్లు రుజువు చేస్తే దేనికైనా సిద్ధమని సవాల్ చేశారు. ఆర్మూర్ లోని విష్ణుజిత్ ఇన్ఫ్రా పేరుతో జీవన్ మాల్ ను మొదట పదిమంది కలిసి 40 లక్షల చొప్పున పెట్టుబడి పెట్టారని వివరించారు. పెట్టుబడి పెట్టిన 10 మంది సంప్రదించడానికి వెళ్తే జీవన్ రెడ్డి స్వాధీనం చేసుకొని ఇప్పటివరకు ఆ 10 మందికి 40 లక్షల చొప్పున డబ్బులు ఇవ్వక ఇబ్బందుల గురి చేస్తున్నట్లు తెలిపారు. బంగారు సాయి రెడ్డికి 20 కోట్లు ఇవ్వక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని చెప్పారు. జీవన్ రెడ్డి బాధితులు తనను సాంప్రదిస్తే వారికి ఇవ్వాల్సిన డబ్బుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు తీసుకెళ్లి తీసుకున్న డబ్బులను కక్కిస్తానన్నారు. ఇకనుంచి జీవన్ రెడ్డి గాని ఆయన తొత్తులైన అనుచరులు డ్రామాలు చేస్తే వదిలేది లేదని హెచ్చరించారు. ఆయన తొత్తుల భూములలో 200 వెంచర్ లో 30 వేల గజాలు అక్రమంగా తీసుకున్నాడని ఆరోపించారు. దీనికోసం నియోజకవర్గ నిధులు 10 లక్షలు మంజూరు చేసి నిర్మాణాలు చేశారని వివరించారు. జీవన్ రెడ్డి మాల్ కొరకు వెంకటేశ్వర కాలనీలోని ఇంటిని ఏపీ ఎస్ఎఫ్సి వద్ద తాకట్టు పెట్టి 20 కోట్లు రుణం తీసుకున్నారన్నారు. ఎస్ ఎఫ్ సి కి మాటీగేజ్ చేసిన ఇంటిని చిన్నమ్మ కుమారుడి పేరుపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన భాగోతాన్ని తొందరలో బయటపెడతానన్నారు. హైదరాబాద్ లో దామోదర్ రెడ్డి అనే వ్యక్తికి 22 వేల గజాల స్థలం ఇస్తానని చెప్పి మోసం చేసి 100 ఎకరాలు అక్రమంగా తీసుకున్నాడని




అన్నారు. జీవన్ రెడ్డి ఒక పెద్ద దొంగ కాబట్టి బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావులు వాస్తవాలు గ్రహించి పార్టీ అధ్యక్ష పదవితో పాటు పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో విలువలేని జీవన్ రెడ్డి ఇకనుంచి అవాకులు చవాకులు చెబితే సహించేది లేదని తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఆర్మూర్ లోని డిగ్రీ కళాశాల వద్ద నీటిపారుదల శాఖ స్థలంలో వేసిన వెంచర్ బాగోతాన్ని బయటపెడతామన్నారు. జీవన్ రెడ్డి బాధితులు పివిఆర్ కు వచ్చి ఫిర్యాదు చేస్తే సీఎంతో మాట్లాడించి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ భూములు డబ్బులు ఇచ్చే రకమని, జీవన్ రెడ్డి డబ్బులు భూములు దొబ్బే రకమని విమర్శించారు. ఇకముందు మహేష్ కుమార్ గౌడ్, సుదర్శన్ రెడ్డి గురించి మాట్లాడితే తగిన గుణపాఠం నేర్పిస్తామన్నారు. యజమానుల వద్ద డబ్బులు వసూలు ఆరోపణలు అవాస్తమన్నారు. జీవన్ రెడ్డి పింకు బుక్కు, నీ తొత్తులు, వారి భాగోతాన్ని బయటపెట్టి బట్టలూడదీసి త్రిప్పుతానని హెచ్చరించారు. జీవన్ రెడ్డి క్రషర్ పెట్టి ప్రభుత్వానికి 80 కోట్లు బకాయి ఉన్నాడని, ఆ డబ్బులను ప్రభుత్వం వసూలు చేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మాజిద్, మున్సిపల్ మాజీ చైర్మన్ పండిత్ పవన్, మాజీ వైస్ చైర్మన్ షేక్ మును, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ వాసు, నాయకులు కొంతం మురళి, భూపేందర్, చిట్టి రెడ్డి, శ్రావణ్, జిమ్మీ, నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర యువ నాయకుడు మెరుగు రవి గౌడ్ ఎంఎల్సీ తీన్మార్ మల్లన్నను కలసి యువతాభివృద్ధి, ప్రజాసమస్యలపై చర్చ

ప్రజా ఎన్‌కౌంటర్ న్యూస్ బ్యూరో, మహబూబాబాద్:

యువతలో పాల్గొనడం మరియు ప్రజా సమస్యల పరిష్కారాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర యువ నాయకుడు మెరుగు రవి గౌడ్ హైదరాబాద్లో ఎంఎల్సీ తీన్మార్ మల్లన్నను కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయి ప్రధాన సమస్యలు మరియు యువతాభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరిగింది. యువతకు మద్దతుగా మల్లన్న చూపిస్తున్న స్థిరమైన సహకారానికి రవి కృతజ్ఞతలు తెలిపారు.చర్చల్లో గ్రామాల్లో యువత పాత్ర, ప్రజాసేవ, సామాజిక సమస్యల పరిష్కారం, రాబోయే స్థానిక ఎన్నికల్లో యువత భాగస్వామ్యంపై ప్రత్యేకంగా ప్రస్తావన జరిగిందని పేర్కొన్నారు. నిబద్ధత, అవినీతి లేకుండా ప్రజాసేవలో పాల్గొనే యువ నాయకులకు పూర్తి మద్దతును తీన్మార్ మల్లన్న అందిస్తారని తెలిపారు.మెరుగు రవి గౌడ్ ఈ భేటీ యువత సంబంధిత సమస్యలకు సమాధానాలను ముందుకు తీసుకువెళ్ళదని, బీసీ సంఘాలకు న్యాయం కల్పించడంలో దోహదపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో విక్రమ్ గౌడ్ మరియు ఇతర స్థానిక నాయకులు కూడా పాల్గొన్నారు.



# జీవన్ రాథోడ్ స్టేట్ టీచర్స్ యూనియన్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక

ప్రజా ఎన్‌కౌంటర్ న్యూస్ బ్యూరో, సంగారెడ్డి:

తెలంగాణ రాష్ట్ర టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు), సంగారెడ్డి జిల్లా శాఖ ప్రత్యేక కార్యవర్గ సమావేశంలో, మనూర్ మండల్ అతి మ్యంల్ ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీ జీవన్ రాథోడ్ను 2025–27 కాలానికి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సాబర్ అలీ నిర్వహించిన అభినందన సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు మరియు ప్రధాన కార్యదర్శి శ్రీ సదానందం గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంలో రాష్ట్ర నాయకులు, డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ నిర్వహించిన పోటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఉపాధ్యాయులు తిరిగి %ుజు% పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, సుప్రీంకోర్టు ద్వారా మినహాయింపులు సాధించవచ్చని ముఖ్యంగా తెలిపారు. అలాగే, పెండింగ్ ఉన్న లిడియర్‌నెస్ అలావెన్స్ (%ణూ%)లిను వెంటనే విడుదల చేయాలని, ఆలస్యమవుతున్న పే రివిజన్ కమిషన్ (%ూ=జ%) రిపోర్ట్ను అమలు చేయాలని, పేద విద్యార్థుల కోసం సేవ చేస్తున్న ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు.79 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల హక్కుల కోసం కృషి చేస్తున్న ఎస్‌టియు, ఉపాధ్యాయులను నిర్మాణాత్మక విధానాలతో మద్దతుగా నిలిపి, వారికి అవసరమైన సేవలను అందిస్తుందని నాయకులు హామీ ఇచ్చారు. అలాగే, అంగవికలాంగులైన ఉపాధ్యా యులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ కోసం ఇతర పాఠశాలలకు పంపడం, ఎలక్షన్ డ్యూటీలను బాధాకరంగా విధించడం నివారించాలని కోరారు.జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రాథోడ్ ప్రీ–ప్రైమరీ పాఠశాలల్లో ఉపాధ్యాయులను శాశ్వతంగా నియమిం చేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు.నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రధాన కార్యదర్శి జీవన్ రాథోడ్ రాష్ట్ర యూనియన్ నాయకత్వానికి, జిల్లా ఉపాధ్యాయ సమాజానికి కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లా ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబర్ అలీ, రాష్ట్ర హెడ్‌క్వార్టర్స్ కార్యదర్శి కరుణాకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్, జిల్లా అధికారులు, మండల అధ్యక్షులు మరియు జిల్లాలోని పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# హిల్ట్ పాలసీ పేరుతో వేలకోట్ల కుంభకోణం

### 9 వేల ఎకరాల్లో రియల్ఎస్టేట్ వ్యాపారం

### గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన బిజెపి

### ప్రభుత్వ అక్రమాలకు నిరసనగా 7న ధర్నా

హైదరాబాద్,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్)

హిల్ట్ పాలసీ పేరుతో రూ.వేలకోట్ల కుంభకోణం జరుగుతోందని గవర్నర్‌కు బిజెపి ఫిర్యాదు చేసింది. తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం గవర్నర్‌ను కలిసింది. అక్రమాలు జరగకుండా చూడాలని వినతిపత్రం అందజేసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, ఎన్వీ సుభాష్ తదితరులు ఉన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాం తాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. 'హిల్ట్ పాలసీ ద్వారా అక్రమాలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 9 వేల ఎకరాలను రియల్ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు యత్ని స్తోంది. అప్పటి, ఇప్పటి ధరలు పోల్చి చూస్తే అక్రమాలు తెలుస్తు న్నాయి. కోకాపేటలో భూముల ధర ఇటీవల ఎంత పలికిందో మనం చూశాం. ఈ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 7న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తాం. జీహెచ్ఎంసీ విస్తరణలోనూ అనేక కుట్రలు ఉన్నాయని నేతలు ఆరోపించారు.అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. హిల్ట్ పాలసీని వ్యతిరేకిస్తూ గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇండస్ట్రియల్‌కు కేటాయించిన భూములను హిల్ట్ పేరుతో రియల్ ఎస్టేట్‌గా మారుస్తూ కోట్ల రూపాయలు అవకతవకలకు తెర లేపుతున్నారని ఆరోపించారు. మార్కెట్ వాల్యూ కన్నా తక్కువ రేట్లకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. 6 లక్షల 30 వేల కోట్ల విలువైన 9292 వేల ఎకరాల భూములను కేవలం 5 వేల కోట్లకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతున్నారని తెలి పారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందా..? పరిపాలన చేస్తుందా.. అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందింది కాబట్టే ఇండస్ట్రియల్ భూము లను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టి లబ్ధి పొందుతున్నారని వ్యాఖ్యలు చేశారు. హిల్ట్‌కు వ్యతిరేకంగా ఈనెల 7న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా చేపట్టబోతున్నామని ప్రకటించారు. హిల్ట్ పాలసీపై ప్రభుత్వంతో చర్చిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామ చందర్ రావు వెల్లడించారు. ప్రభుత్వ వైఫల్యాను వ్యతిరేకంగా 7న నిరసన దీక్ష చేపట్టబోతున్నామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రకటించారు.



# విద్యుత్‌లో రూ.50వేల కోట్ల స్కాంకు తెర

### కొత్త డిస్కమ్..థర్మల్ ప్లాంట్‌ల నిర్మాణంలో కమీషన్లు

### విద్యుత్ శాఖను ఎపి ప్రభుత్వం నడుపుతోందా?

### ఎన్టీపిసి తక్కువ రేట్లకే విద్యుత్ ఇస్తామంటే తీసుకోరా

### మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

హైదరాబాద్,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):

విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఇప్పటికే ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఉండగా కొత్త డిస్కమ్ ఎందుకని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్షన్‌లోనే రేవంత్ యాక్షన్ చేస్తున్నారని ఆరోపించారు. కమీషన్లను దండుకునేందుకే ఇలాంటి స్కామ్‌లకు తెరదీశారు. ఇలా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ రూ.50వేల కోట్ల స్కాంకు తెరలేపిందని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. థర్మల్ విద్యుత్‌ను తగ్గిస్తామన్న ప్రభుత్వం.. కొత్త ఎలాంట్లు ఎందుకు నిర్మిస్తోందని ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అధికారులను అవమానించిన కుమార్ రాజాను వెంటనే తరిమికొట్టాలని హెచ్చరించారు.అండర్ గ్రౌండ్ కేబుల్స్, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ కరెంట్ సహా ఇంటర్‌స్టేట్ స్కామ్‌నూ త్వరలోనే ఆధారాలతో సహా బయటపెడతాం అని తెలిపారు. రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రంలో రూ.50 వేల కోట్ల స్కాంను బయట పెట్టినందుకే తనను టార్గెట్ చేస్తున్నారని హరీశ్ రావు అన్నారు. థర్మల్ విద్యుత్ ను తగ్గిస్తామని చెప్పి కొత్త ప్లాంటు ఎందుకు కడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. కమీషన్ల కోసమే కొత్త థర్మల్ ప్లాంట్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. రూ.10,800 కోట్లతో జెన్కో డీపీఆర్ ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎన్టీపీసీ వాళ్లు రూ. 4.12 పైసలకు యూనిట్ ఇస్తామంటే ప్రభుత్వం ముందుకు రాలేదన్నారు .ఎన్టీపీసీ 2400 మెగావాట్ల విద్యుత్ ఇస్తామంటే ఎందుకు ముందుకు రావట్లేదని ప్రశ్నించారు. రామగుండం కొత్త థర్మల్ ప్రాంట్ తో రోజూ ప్రజలపై రూ. 9 కోట్ల భారం పడుతుందని చెప్పారు. 25 ఏండ్లకు కొత్త



ప్లాంట్ తో ప్రజలపై రూ. 82 వేల కోట్ల భారం పడుతుందన్నారు. తక్కువ ధరకు వచ్చే విద్యుత్ ను ఎందుకు వద్దంటున్నారని ప్రశ్నించారు. రూ.82 వేల కోట్ల భారం ప్రజలెందుకు భరించాలన్నారు హరీశ్. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే కరెంట్ లో ఈ దుస్థితి వచ్చిందన్నారు. విద్యుత్ శాఖలో తెలంగాణ ప్రాంత అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. కమీషన్ల కోసమే కొత్త విద్యుత్ ఎ÷–లాంట్లు నిర్మిస్తున్నారని ఆరోపణలు చేశారు. ఎన్టీపీసీ.. రూ.4.12పైసల్లకు యూనిట్ విద్యుత్ ఇస్తామంటే తీసుకోవడానికి కాంగ్రెస్ సర్కార్ ఎందుకు ముందుకు రావట్లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్టీపీసీ 2,400 మెగావాట్ల విద్యుత్ ఇస్తామంటే ఎందుకు ముందుకు రాలేదు? అని నిలదీశారు హరీశ్‌రావు. ఎన్టీపీసీ ఇచ్చే తక్కువ ధర కరెంటును కాదని.. సొంతంగా విద్యుత్ ప్లాంట్లు ఎందుకు ఏర్పాటు చేస్తామని అంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే విద్యుత్ రంగంలో ఈ దుస్థితి నెలకొందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖను తెలంగాణ ప్రభుత్వం నడుపుతుందా..? లేదా ఏపీ ప్రభుత్వం నడుపుతుందా? అని ఎద్దేవా చేశారు. విద్యుత్ శాఖలో తిష్టవేసుకుని కూర్చున్న ఆంధ్ర ప్రాంత అధికారులను వెంటనే సాగనంపాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్పంచ్ ఎన్నికలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. ఓటర్లను సీఎం పరోక్షంగా ప్రభావితం చేస్తుంటే.. ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు. గ్రామాల్లో ఎన్నికలు జరుగుతుంటే.. పట్టణాల్లో సీఎం తిరుగుతానంటే ఎలా అని నిలదీశారు

# దోపిడీకి పాల్పడుతున్న నిషేధిత సంస్థ సభ్యులు

## ముగ్గరుని అరెస్ట్ చేసిన భద్రతా బలగాలు

**ఇంఫాల్,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

దోపిడీలకు పాల్పడుతున్న వివిధ నిషేధ సంస్థలకు చెందిన ముగ్గురు సభ్యులు సహా ఏడుగురిని భద్రతా దళాలు అరెస్టు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కామ్జోంగ్ జిల్లాలోని ్గ÷కో అవుట్‌పోస్ట్‌లో నిర్వహించిన సాధారణ తనిఖీల్లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వారి నుండి లెక్కచూపని రూ. 57లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ నలుగురు ఉగ్రవాద గ్రూపులతో సంబంధాలు కలిగి ఉన్నారని అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కాంగ్లీపాక్ (పిఆర్‌ఇపిఎకె)కి చెందిన ఒక సభ్యుడిని ఆదివారం ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని ఖగేంపల్లిలో అతని నివాసం నుండి అరెస్ట్ చేశారని అన్నారు. అతను వైద్యులు, ఆస్పత్రులు, స్కూల్ వ్యాన్ అసోసియేషన్‌లు, పాఠశాలలు, బేకరీ దుకాణాలు, జిమ్‌లపై దోపిడీకి పాల్పడ్డాడని తెలిపారు. నిషేధిత పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన ఇద్దరు క్రియాశీల సభ్యులను ఇంఫాల్ తూర్పు జిల్లాలోని కాంగ్లా స్గి÷ మరియు తౌబాల్ జిల్లాలోని ఇంగౌరోక్ నుండి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

# శ్రీలంకపై విరుచుకుపడ్డ దిత్వా తుఫాన్

## ఇప్పటికే 334 మంది మృతి...మరో 370మంది గల్లంతు

**కొలంబొ,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

దిత్వా తుపాను శ్రీలంకపై విరుచుకుపడింది. తుపాను ప్రభావంతో ఇప్పటివరకు సుమారు 334మంది మరణించినట్లు అధికారులు సోమవారం తెలిపారు. మరో 370మంది గల్లంతయ్యారని అన్నారు. బదుల్లా, నువారా, ఎలియా మరియు మటలే జిల్లాల్లో ఆదివారం అధిక సంఖ్యలో మరణాలు నమోదయ్యాయని అన్నారు. కొండచరియలు విరిగిపడటంతో పలువురు శిథిలాల కింద చిక్కుకుపోయారని అన్నారు. సుమారు 11లక్షలకు పైగా ప్రజలు తుపానుతో తీవ్రంగా ప్రభావితమయ్యారని, సుమారు 2 లక్షలమంది నిరాశ్రయులయ్యారని విపత్తు నిర్వహణ కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. దిత్వా తుఫాను కారణంగా శ్రీలంకలోని అనేక జిల్లాల్లో రికార్డు స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయని, పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయని వెల్లడించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నిషేధిత జోన్‌లో చిక్కుకున్న ప్రయాణికులను తరలించేందుకు తమ హెలికాప్టర్లు శ్రీలంక అధికారులతో కలిసి హైబ్రిడ్ రెస్క్యూ మిషన్ చేపట్టాయని భారత వైమానిక దళం తెలిపింది. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకె తెలిపారు.

# అరటి రైతులను ఆదుకోండి

## ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి సోమవారం సిపిఎం వినతి

**అనంతపురం,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

పుట్లూరు మండలంలోని అరటి రైతులను ఆదుకోవాలని సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కి సోమవారం సిపిఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ఎస్ సూరి మాట్లాడుతూ.. పుట్లూరు మండలంలో అరటి రైతులకు ఎకరాకు 50వేల నష్ట పరిహారం కల్పించాలన్నారు. అరటి రైతులకు ప్రభుత్వమే నేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అరటి తన్నుకు 15000, మొక్కజొన్నకు కింటాకు 2,500 చొప్పున కల్పించాలన్నారు. అలాగే రైతులకు ఎరువులు నీళ్ల మందులు విత్తనాలు ప్రభుత్వమే సబ్సిడీ కూడా అందజేయాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో ఉపాధి హామీ పనులు కల్పించాలని రోజుకు 600 కూలి ఇవ్వాలని అలాగే 200 రోజులు పని కల్పించాలన్నారు. వితంతు పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సూరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి టి. పెద్దయ్య, మండల రైతు సంఘం నాయకులు శివారెడ్డి, జే. పెద్దయ్య, బి భాస్కర్ రెడ్డి, కే నాగభూషణ్, టి ఆదినారాయణ , రైతులు కూలీలు తదితరులు పాల్గొన్నారు.



# ఎచ్చర్ల మండల తీరానికి బంగ్లా బోటు

**శ్రీకాకుళం,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

బంగ్లాదేశ్‌కు చెందిన 13 మంది మత్స్యకారులు చేపల వేట చేస్తూ సముద్రంలో దారి తప్పి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం డి. మత్స్యలేశం తీరానికి చేరుకున్నారు. వారి బోటును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆకలితో ఉన్న వారికి స్థానిక మత్స్యకారులు భోజనం పెట్టారు. మెరైన్ సిఐ ప్రసాదరావు, ఎచ్చెర్ల పోలీసులు, మత్స్యశాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని వీరిని కళింగపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దిత్వా తుపాను నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో వీరు అదుపు తప్పి వచ్చారా? వేరే కారణం ఉందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక విచారణలో వారిని బంగ్లాదేశ్‌లోని బోలబార్సిల్ జిల్లా చర్‌కోలాచద్ గ్రామానికి చెందిన సయివ్, జహంగీర్, సభీర్, కోకన్, మఖ్‌సూద్, మాలిక్, మహ్మద్ ఫరూఖ్, మాక్‌సుద్, నాసిర్, హెలెల్, ఫరూఖ్, అలామ్, సమెన్‌గా గుర్తించారు. వీరు నవంబరు పదో తేదీన చేపల వేటకు వెళ్లి తప్పిపోయినట్లు గుర్తించారు. సముద్రంలో బోటు దారి తప్పి, 20 రోజుల తర్వాత డి. మత్స్యలేశం సముద్ర తీరానికి చేరుకున్నారు. దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ రైజింగ్‌తో ఆర్థికాభివృద్ధి సాధ్యమేనా ?

## లక్ష్యాలను అనుకున్నట్లుగా తీసుకెళ్లే సామర్థ్యం ముఖ్యం

**హైదరాబాద్,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

తెలంగాణలో సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు పూర్త ఇచేసుకోబోతోంది. ఈ క్రమంలో 'తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్' రూపొందిస్తోంది. భవిష్యత్‌లో చేయబోయే కార్యక్రమాలు. అభివృద్ధిపై ఇందులో ప్రస్ఫుటంగా ప్రస్తావించనున్నారు. ఏరకంగా ముందుకు వెళుతున్నదీ వివరించనున్నారు. అయితే ఇది అంత ఆషామాషీ విషయం కాదు. ఇప్పటికే నిధుల కొరత, అప్పుల ఊబిలాంటి సమస్యలు ఉన్నాయి. వీటిని అధిగమించాలి. ఇందుకు ఆర్థిక కట్టుబాట్లు కూడా అవసరం. ఇవన్నీ లేకుండా ఇంత పెద్ద లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడం అంత సులువు కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, భవిష్యత్ పాలసీ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రజలకు అంకితం చేయాలని నిర్ణయించింది. తెలంగాణ భవిష్యత్తు కోసం రూపొందిస్తున్న 'తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్'పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ డాక్యుమెంట్‌కు 'రైజింగ్ 2047'గా నామకరణం చేశారు. గతాన్ని అనుభవంగా తీసుకుని, ఆ అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుంటూనే భవిష్యత్‌కు అడుగులు వేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి ఈ మేరకు ప్రకటించారు. పాలసీలలో పెరాల్సిస్ వస్తే రాష్ట్ర భవిష్యత్ తీవ్రంగా నష్టపోతుందని హెచ్చరించారు. ఈ పాలసీ డాక్యుమెంట్ తయారీలో భాగంగా, తాము ఐఎస్‌బీ, నీతి ఆయోగ్ వంటి ప్రముఖ సంస్థల సలహాలు కూడా తీసుకున్నట్లు వెల్లడించారు. విజన్‌లో భాగంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగానే తెలంగాణను మూడు ప్రధాన ఆర్థిక విభాగాలుగా వర్గీకరించారు. తెలంగాణ ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్రంలోని ప్రాంతాలను మూడు విభాగాలుగా విభజించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతం అంతా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా పరిగణిం చబోతున్నారు. గతంలో ఔటర్ లోపలి ప్రాంతంలో ఉన్న నాలుగు విభాగాల గందరగోళం తొలగిపోతుందని, కాలుష్య రహిత నగరంగా ఉండాలంటే ఈ ప్రాంతాన్ని 'క్యూర్' చేయాల్సిందేనని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు బయటి నుండి ఆర్‌ఆర్‌ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీగా గుర్తించారు. 360 కి.మీ. పొడవైన ఆర్‌ఆర్‌ఆర్‌కు కేంద్రం అంగీకారం తెలిపిందని, ఇది నగరానికి రెండో అర్బన్ రీజియన్‌గా మారుతుందని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేలతో పాటు, బుల్లెట్ ట్రైన్ వేయడానికి కేంద్రం నుండి అనుమతి తెచ్చామని, హైదరాబాద్-బెంగుళూరు మధ్య కనెక్టివిటీని పెంచి అభివృద్ధిని సిద్ధం చేస్తున్నామని సిఎం రేవంత్ ప్రకటించారు. ఆర్‌ఆర్‌ఆర్ బయటి నుండి తెలంగాణ సరిహద్దు వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీగా గుర్తించారు. ఆదాయం పెంచాలి? పేదలకు పంచాలి అనేది తమ ప్రభుత్వ విధానమని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఫుడ్ సమస్య లేకపోయినా, పోషకాహార సమస్య ఉందని, దాన్ని ఎలా పరిష్కారం చేయాలనే దానిపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ గ్రామాలకు చేరినప్పటికీ, ఇప్పుడు నాణ్యమైన విద్య, సాంకేతిక విద్య అందించడంపై దృష్టి పెట్టామని, విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. తెలంగాణను 'నాలెడ్జ్ హబ్'గా మారిస్తే, పెట్టుబడులు, కంపెనీలు క్యూ కడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఎయిర్ పోర్టుల విస్తరణలో భాగంగా వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం, రామగుండంలో కొత్త ఎయిర్‌పోర్టులు తెస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇవన్నీ సకారాం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నదే తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా చెబుతున్నారు. అయితే ఇది ఎంతవరకు

# ప్రజలు సహకరించాలి.. పోలీస్ నిబంధనలు పాటించాలి

## : సిపి సాయి చైతన్య

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో**




విగ్రహాల ప్రతిష్టాపన, శబ్ద కాలుష్యం నియంత్రణ, ఊరేగింపులు, సభల నిర్వహణ, సార్వజనిక ప్రదేశాల్లో నియమాలు, డ్రోన్ల వినియోగం పై ఆంక్షలు, నకిలీ గల్ఫ్ ఏజెంట్ల నుండి అప్రమత్తం,ఎ " సర్టిఫికెట్ ఉన్న సినిమాల వీక్షణం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధం అంశాలను జిల్లా ప్రజలు పాటించాలని సోమవారము నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 వరకు ఉత్తర్వులు అమలులో ఉంటాయన్నారు. విగ్రహాల ప్రతిష్టాపన అంశంలో కలెక్టర్ అనుమతి పొందాలని, జనసామర్థ్యం ప్రాంతాల్లో విగ్రహాలను పెట్టవద్దని, ఎక్కువ శబ్దంతో డి.జే లను ఏర్పాటు చేయరాదని, వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని, వాణిజ్య నివాస ప్రాంతాల్లో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలని రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డి.జే ల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేదం ఉందన్నారు. అసిస్టెంటు పోలీస్ కమిషనర్ అనుమతి తప్పనిసరి. 500 మంది కంటే ఎక్కువ జనాలతో కూడిన కార్యక్రమనికి 72 గంటల ముందుగా పోలీస్ కమిషనర్ అనుమతి తీసుకోవాలి. సార్వజనిక ప్రదేశాల్లో నియమాలు మాల్స్, సినిమా ధియేటర్స్, హొటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం సెక్యూరిటి నిబంధనలు తప్పనిసరి పాటించాలి. ప్రతీ ఒక్కరు క్యూ పద్దతిని తప్పనిసరి పాటించాలి.డ్రోన్ల వినియోగం పై ఆంక్షలు: ముందస్తుగా సంబంధిత ప్రభుత్వ సంస్థలు, పోలీసు, ఏవియేషన్ అధికారుల నుండి క్లియరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. నకిలీ గల్ఫ్ ఏజెంట్ల నుండి అప్రమత్తంగా ఉండాలని, జిల్లా ప్రజలు గల్ఫ్ ఏజెంట్లకు తమ ఇల్లు అద్దెకు ఇచ్చే ముందుజాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అటువంటి వారు అద్దెకు వస్తే ముందస్తుగా వారి సమాచారాన్ని సంబంధిత పోలీసు స్టేషన్ వారికి తెలియజేయాలని, " ఎ " (పెద్దలు) సర్టిఫికేట్ పొందిన సినిమాలను మైనర్లు చూడటానికి ధియేటర్లు అనుమతించ రాదని అన్నారు.

# టిటిడి పరిధిలోని ఆలయాల్లోనూ అన్నప్రసాదం

## తిరుమల తరహాలో నిర్వహించాలి: టిటిడి ఇవో

**తిరుపతి,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

తిరుమల తరహాలోనే టిటిడి పరిధిలోని ఆలయాల్లోనూ భక్తులకు అన్న ప్రసాదాలు అందించాలని ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. దీని వల్ల భక్తులకు ఇబ్బందులు ఉండవని అన్నారు. దీనిపై నివేదిక ఇవ్వాలన్నారు. తితిదే పరిధిలోని ఆలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఈవో సమీక్షించారు. తితిదే పరిధిలోని ఆలయాల్లో అన్నప్రసాదాల పంపిణీకి సంబంధించి అన్న ప్రసాదాలు తయారు చేసే పోటు సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని, అన్న ప్రసాదాల పంపిణీ సవ్యంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆలయాల్లో ఇప్పటివరకు పంపిణీ చేస్తున్న అన్న ప్రసాదాలపై రోజు వారీ నివేదికను తయారు చేయాలన్నారు. తితిదే ఉద్యోగుల్లో ఇప్పటికీ ఇతర మతాలకు చెందిన వారు ఉంటే వారిని గుర్తించి నివేదిక రూపొందించాలన్నారు. దేశవ్యాప్తంగా తితిదే పరిధిలో చేరిన చారిత్రక ఆలయాలకు, ఇతర ఆలయాలకు, ఏయే ఆలయాలకు వేదపారాయణదారులను నియమించాలి? ఎంత మంది అర్చకులను నియమించాలి? అనే అంశాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు. తితిదే పరిధిలోకి వచ్చిన ప్రతి ఆలయానికి సంబంధించి ప్రామాణిక నిర్వహణ ప్రక్రియ (ఎస్.ఓ.పి) రూపొందించి వచ్చే సమావేశంలో నివేదించాలన్నారు. శ్రీనివాస కల్యాణాలను క్రమంగా నిర్వహించేందుకు వీలుగా క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్‌ను రూపొందించాలన్నారు.



తద్వారా భక్తులకు ముందుగానే కల్యాణానికి సంబంధించిన సమాచారం తెలుస్తుందని చెప్పారు. అమరావతిలోని వెంకట పాలెంలో ఉన్న శ్రీవేంకటేశ్వర ఆలయ విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 25 ఎకరాల్లో ఇప్పటికే ఉన్న ఆలయంతో పాటు, ఇకపై నిర్మించనున్న కల్యాణ కట్ట, అర్చకులు, సిబ్బంది క్వార్టర్స్, ప్రాకారం, గోపురాలు, పుష్కరిణి, తదితర నిర్మాణాలపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఈవో సూచించారు.

# స్పూఫింగ్‌తో విమానాల రాకపోకలకు అంతరాయం

## అలాంటి సమస్య కలగలేదన్న కేంద్రమంత్రి రామ్మోహన్

**న్యూఢిల్లీ,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

జీపీఎస్ స్పూఫింగ్‌తో విమానాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పుకొచ్చారు. సంప్రదాయ నావిగేషన్ సహాయంతో రన్‌వేను ఆపరేట్ చేశారని వివరించారు. ఢిల్లీ విమానాశ్రయంలో జీపీఎస్ స్పూఫింగ్‌పై వైసీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సమాధానం ఇచ్చారు. ఇటీవల ఢిల్లీ విమానాశ్రయంలో ల్యాండింగ్ సమయంలో జీపీఎస్ స్పూఫింగ్ జరిగిందని పైలట్స్ రిపోర్ట్స్ వచ్చాయని.. కంటెంజెన్సీ ప్రొసీజర్స్ ద్వారా ఈ పరిస్థితిని అధిగమించాయని తెలిపారు. . కోల్‌కతా, అమృత్‌సర్, ముంబై, హైదరాబాద్, బెంగళూరు చెన్నైలలో కూడా జీపీఎస్ స్పూఫింగ్ జరిగినట్లు రిపోర్ట్స్ వచ్చాయని గుర్తుచేశారు. గ్లోబల్ బెస్ట్ ప్రాక్టీసెస్ ఉపయోగించి గ్రౌండ్ బేస్ నావిగేషన్ ఉపయోగిస్తున్నామని చెప్పు కొచ్చారు. విమానాల రంగంలో మాల్వేర్ ద్వారా సైబర్ దాడులు జరుగు తున్నా యని.. అడ్వాన్స్‌డ్ సైబర్ సెక్యూరిటీ ద్వారా ఈ దాడులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు రక్షణాత్మక విధా నాల ద్వారా సైబర్ దాడులను అధిగ మిస్తున్నామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.



# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అవినీతిపై సిబిఐ విచారణ

## సిఐటియు నేత సిహెచ్ నర్సింగరావు డిమాండ్

**విశాఖపట్టణం,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అవినీతిపై సిబిఐ విచారణ చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. విశాఖపట్నం జగదాంబ జంక్షన్‌లో ఉన్న నందూరి ప్రసాదరావు భవనంలో సోమవారం స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.జగ్గునాయుడు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వికుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 'కోక్ ఓవెన్' డిపార్టుమెంట్లో గత 35 సంవత్సరాలలో ఎన్నడూ వాడని నాసిరకం కోక్‌ను వాడుతున్నారన్నారు. దీనివల్ల నాణ్యతలేని స్టీల్ ఉత్పత్తి అవుతుందని, దీనిని కొనుగోలుదారులు తిరస్కరి స్తున్నారని తెలిపారు. ఈ చర్యల వల్ల విశాఖ స్టీల్ బ్రాండ్‌ను చెడిపోయే ప్రమాద ముందన్నారు. నేరుగా విదేశాల నుంచి దిగుమతిచేసే కోకింగ్ కోల్ బదులు మార్కెట్లోని నాసిరకం కోక్‌ను కమిషన్ల కోసం కొంటున్నారన్నారు. గతంలో నాసిరకం ఇనుపఖనిజం వాడడంపై సిబిఐకి సిఐటియు ఫిర్యాదు చేసిందన్నారు. జగ్గయ్యపేటలోని విశాఖస్టీల్ ఎలాంట్‌కు స్వంత గనుల నుంచి వచ్చే సున్నపురాయి (లైమ్ స్టోన్) సరఫరా లేకపోవడంతో రెండు రోజులు అతిముఖ్యమైన స్టీల్ మెల్టింగ్ షాప్ (ఎస్ఎంఎస్)లో ఉత్పత్తి ఆగిపోయిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మార్కెట్లో ఉన్న మంచిపేరును దెబ్బతీయడానికే సిఎండి, కేంద్ర ప్రభుత్వం కావాలని ఇటువంటి తప్పుడు పద్ధతులకు దిగజారారని విమర్శించారు. 2024 నుంచి మిల్స్ డిపార్టుమెంట్లోని క్వాలిటీ ఇన్స్పెక్షన్‌ను ఎత్తివేశారన్నారు. విశాఖ స్టీల్‌ను దెబ్బతీయాలని, నష్టాల్లోకి నెట్టాలని చేస్తున్న తప్పుడు చర్య ఇది అన్నారు. స్టీల్ ప్లాంట్‌లో ఎప్పుడూ 45 రోజులకు సరిపడ ముడి ఖనిజాలు నిలవ ఉండాలన్నారు. కనీసం మూడు రోజులకు సరిపడ ముడిసరుకు నిల్వలు నేడు ఉండడం లేదన్నారు. విశాఖ స్టీల్ ఎలాంట్‌కు 2025 ఏప్రిల్ రూ.74 కోట్లు, మే నెలలో రూ.52 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. అప్పటి వరకు రెండు బ్లాస్ట్ పర్నేష్‌లే నడిచాయన్నారు. 2025 జనవరి నుంచి జూన్ వరకు లాభాలు వచ్చాయన్నారు. 2025 జూన్ నుంచి మూడవ బ్లాస్ట్ పర్నేష్ ఉత్పత్తి ప్రారంభించిందన్నారు. 2025 జూలైలో రూ.121 కోట్లు, ఆగష్టులో రూ.157 కోట్లు నష్టాలు తెచ్చాయని, దీనికి బాధ్యులు ఎవరనే దానిపై సిబిఐతో విచారించాలని నర్సింగరావు డిమాండ్ చేశారు. 2025 జూన్ వరకు రెండు బ్లాస్ట్ పర్నేష్‌లలో 100 శాతం ఉత్పత్తి (రోజుకు 15 వేల టన్నులు) అయిందన్నారు. జూన్ నుంచి నాసిరకం కోక్ బయట మార్కెట్‌లో కొనడం వల్ల బ్లాస్ట్ పర్నేష్ లో ఉత్పత్తి 67 శాతంకు పడిపోయిందన్నారు. నాణ్యతలో పేరుగాంచి గతంలో 4 సంవత్సరాలు అత్యధికంగా విశాఖ స్టీల్ విదేశాలకు ఎగుమతులు చేసి అనేక అవార్డులు పొందిందని గుర్తు చేశారు. కానీ నేడు విశాఖ స్టీల్‌కు నాసిరకానికి రికార్డులు పొందే పరిస్థితిని తీసుకువచ్చిందన్నారు. 2024లో మొత్తం ఉత్పత్తిలో ముడిఖనిజాల ఖర్చు 63 శాతం ఉండగా, 2025లో ముడిఖనిజాల ఖర్చు 75 శాతంకు అమాంతంగా పెరిగిందన్నారు. ప్రపంచంలో ఏ స్టీల్‌లోనూ ముడిఖనిజం ఖర్చు ఈ స్థాయిలో లేదన్నారు. మన దేశంలో కూడా సెయిల్లో ముడిఖనిజం ఖర్చు సుమారు 50 శాతంగా ఉందన్నారు.ముడిసరుకు ఖర్చు పెంచి కావాలని విశాఖ స్టీల్ ఎ÷-లాంట్‌ను నష్టాల్లోకి నెట్టడానికి కారకులెవరని ప్రశ్నించారు.ముడిసరుకు ముఖ్యంగా కోక్ దిగుమతి చేయకుండా మార్కెట్ లో కొనుగోలు చేయడంలో కమిషన్ ఎవరికి ఎంత ముట్టిందో సిబిఐ విచారణ చేయాలని మరోసారి నర్సింగరావు డిమాండ్ చేశారు.గత ఒక్క సంవత్సరంలో 10 వేల మంది స్టీల్ కార్మికులను తొలగించి, పనిభారం పెంచి, నాణ్యతలేకుండా సిఎండి విశాఖ స్టీల్ ప్లాంట్ ను నడుపుతున్నారని విమర్శించారు. కార్మికులకు ఉత్పత్తి ప్రకారం జీతాలు చెల్లిస్తామని సర్క్యులర్ జారీచేసారన్నారు.నేడు రోజుకు 16 వేల టన్నుల హాట్మెటల్ మూడు బ్లాస్ట్ పర్నేష్ లలో ఉత్పత్తి అవుతుందన్నారు.19 వేల టన్నులకు పైగా హాట్మెటల్ ఉత్పత్తి అయితేనే పూర్తిజీతాలు చెల్లిస్తామని లింక్ పెట్టడం,ఇప్పుడిచ్చే జీతాలను కూడా దిగకోయడానికేనని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విశాఖ స్టీల్ ప్లాంట్లోని మొత్తం పనులను 42 ముక్కలుగా చేసి బయట కాంట్రాక్టులకు ఇవ్వడానికి విశాఖ స్టీల్ యాజమాన్యం 2025 సెప్టెంబర్ లో ఇ.ఓ. ఇ లు ప్రకటించడం అందరికీ తెలుసు అన్నారు.బయట కాంట్రాక్టర్లకు ఇవ్వడానికి సిద్ధం చేసిన టెండర్లలో వ్యయాన్ని విపరీతంగా పెంచారన్నారు.సింటర్ ఎలాంట్లో 2 మిషన్లు నడపడానికి గతంలో వ్యయం రూ.19 కోట్లును రూ.45 కోట్లకు పెంచారన్నారు. బ్లాస్ట్ పర్నేష్‌లో మెయింటెనెన్స్ పనులకు గతంలో రూ.15 కోట్లు ఉంటే అదే పనులను నిర్వహించడానికి రూ.85 కోట్లకు సిద్ధం చేశారన్నారు.స్టీల్ ఉత్పత్తి వ్యయం పెంచి మార్కెట్ లో కొనగోళ్లు పడిపోవడానికి చేస్తున్న కుట్ర ఇది అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్టీల్ ఎ÷-లాంట్ నష్టాలకు కారకులెవరో వెంటనే సమీక్షించాలని కోరారు. యాజమాన్యం అవినీతిని ప్రశ్నిస్తున్నందుకు కార్మికులను ద్రోహులుగా చిత్రీకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటీవల బిఎఫ్ 3 లో కన్వేయర్ బెల్ట్ ను కార్మికులు కట్ చేసారని సిఎండి చేసిన తప్పుడు ఆరోపణలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సెకండ్ కు 2 మీటర్ల స్పీడ్ లో నడిచే కన్వేయర్ బెల్ట్ ను కట్ చేయడం అసాధ్యం అన్నారు.మెంటెనెన్స్ లోపం వల్ల సాప్ట్ విరిగి కన్వేయర్ బెల్ట్ కట్ అవడాన్ని కార్మికులపై నెపం మోపడం దుర్మార్గం అన్నారు.విశాఖ స్టీల్ ఎలాంట్ ను తెల్లఏనుగు (వైట్ ఎలిఫెంట్) అని, కార్మికులను పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్న గోడ్డు ఎంఎలాయిస్ అని తప్పుడు ఆరోపణలు చేసి,నష్టాలను కార్మికులపై నెడుతున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను కార్పొరేట్లకు కట్టబెట్టాలనే నిర్ణయంలో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ఎలాంట్ ను నష్టాల్లోకి కావాలని నెడుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి మార్చేందుకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు,ప్రజలు వత్తిడి పెంచాలని కోరారు.

# అందుబాటులోకి కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి

## ప్రారంభించిన ఎంపి శ్రీభరత్

**విశాఖపట్నం,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

విశాఖనగరంలోని కైలాసగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన గ్లాస్ బ్రిడ్జిని ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకష్ణబాబు, వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ.. వీఎంఆర్డీఏ ద్వారా పర్యాటకానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. విశాఖను పర్యాటక రాజధానిగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. సుమారు రూ.7 కోట్ల నిధులతో గ్లాస్ బ్రిడ్జిని నిర్మించినట్లు తెలిపారు. ప్రకతి వైపరీత్యాల సమయంలో కూడా తట్టుకునేలా గ్లాస్ బ్రిడ్జి డిజైన్ చేశామన్నారు. త్వరలో కైలాసగిరిపై త్రిశూల్ ప్రాజెక్టు కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి 40 ఎంఎం మందం కలిగిన ల్యామినేటెడ్ గాజును జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్నట్లు తెలిపారు. ఒకేసారి 500 టన్నుల బరువు మోయగలదని.. గంటకు 250కి.మీ వేగంతో గాలులు వీచినా తట్టుకోగలదన్నారు. ఒకేసారి 40 మంది పర్యాటకులు ఎక్కి ప్రకృతి అందాలు వీక్షించవచ్చని తెలిపారు.



# పెంచలయ్య హత్యతో కామాక్షి వ్యవహారం బట్టబయలు

## ఇన్నేళ్లుగా గంజాయి వ్యాపారంతో చెలామణి

## కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**నెల్లూరు,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

ప్రజాకళాకారులు, సిపిఎం నాయకులు కె.పెంచలయ్య హత్యకు ప్రధాన సూత్రధారి అరవ కామాక్షి నెల్లూరు నగరంలో గంజాయి సామ్రాజ్యానికి డాన్‌గా వ్యవహరిస్తోంది. నేర సామాజ్యం విస్తరణకు ప్రధాన రాజకీయ పార్టీలను ఆమె వేదిక చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో మరింత రెచ్చిపోయింది. నగరంలో పలు పోలీస్ స్టేషన్లలో ఆమెపై కేసులు ఉన్నాయి. ఆమె భర్త, తమ్ముడు, బంధువులు అంతా ఇదే వ్యాపారం చేస్తున్నారు. పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా రాజకీయ పార్టీల అండతో కామాక్షి తన కార్యకలాపాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఆర్‌డిటి కాలనీలో ఆమె తల్లి, తమ్ముడు, బంధువులు ఉన్నారు. ఇక్కడా గంజాయి సంస్కృతిని పెంచడంతో పెంచలయ్య ఎదుర్కొన్నారు. అక్కడి యూత్‌ను సంఘంగా ఏర్పాటు చేశారు. తమ వ్యాపారానికి అడ్డు వస్తున్నాడనే కక్షతోనే ఆయనను అంత్యంత కిరాతంగా కామాక్షి హత్య చేయించింది. నెల్లూరు నగరంలో సమాధు తోట (బొడిగాడితోట) ప్రాంతంలో ఉంటున్న ఆమె ఆ ప్రాంతంలోని, ఇతర ప్రాంతాల్లోని కొందరి పేద యువకులను ఆశ చూపించి వారితో గంజాయి విక్రయం, దొంగతనాలు చేయిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా డివైఎస్ఐ నెల్లూరు నగరంలో ఆందోళన నిర్వహించింది. కేరళ ఎంపి కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఆ తర్వాత పోలీసులతో కలిసి పెంచలయ్య ఆ ప్రాంతంలో సంఘం ఏర్పాటు చేసి, గంజాయిని విక్రయించనీయకుండా చేశారు. కామాక్షిని కాలనీకి రాకుండా అడ్డుకున్నారు. పెంచలయ్య హత్యతో కామాక్షి నేర సామాజ్యం తెరమీదకు వచ్చింది. నెల్లూరు నగరంతోపాటు, జిల్లా వ్యాప్తంగా గంజాయి సామ్రాజ్యాన్ని విస్తరించినట్టు, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు ఇక్కడి నుంచి గంజాయి సరఫరా చేస్తున్నట్టు, ఇందులో కామాక్షి కీలకంగా వ్యవహరిస్తునట్టు పోలీసులు గుర్తించారు. కేవలం యువకులే కాకుండా కాలేజీ, స్కూల్ పిల్లలను గంజాయికి బానిసలుగా మార్చినట్లు పోలీసులలో విచారణలో తేలింది. కామాక్షి రాజకీయ పలుకుబడి పెంచుకొని తన నేర సామాజ్యాన్ని విస్తరించింది. 2024 ఎన్నికలు, అంతకు ముందు వైసిపికి సన్నిహితంగా మెలిగింది. నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించింది. వైసిపి కారణంగానే పోలీసులు ఆమె జోలికి వెళ్లలేదనే ప్రచారం ఉంది. పెంచలయ్య హత్య సూత్రధారి కామాక్షేనని తేలయడంతో పోలీసులు ఆమె మూలలను వెతికి బయటకు తీస్తున్నారు. సత్యనారాయణపురం, పెన్నా ప్రాంతంలో ఇటీవల రూ.80 లక్షలతో నూతన గృహ నిర్మించినట్లు గుర్తించారు. ప్రధాన రాజకీయ పార్టీలకు చందాలు ఇచ్చిందనే ప్రచారం ఉంది. పెంచలయ్య హత్య తర్వాత గంజాయి విషయంలో వైసిపి, టిడిపి ఇరకాటంలో పడ్డాయి. కామాక్షి వైసిపికి చెందిన వారని టిడిపి నేత, నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధారాలతో బయటపెట్టారు. టిడిపికి చెందిన వ్యక్తిగా వైసిపి నేతలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి ఆరోపించారు. పెంచలయ్య హత్య నేపథ్యంలో మాదక ద్రవ్యాలపై ప్రజా ఉద్యమం రానుంది. కామాక్షితోపాటు ఈ కేసుతో ప్రమేయం ఉన్న అందరినీ శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

# రథశాలను ప్రారంభించిన మంత్రి వాసంశెట్టి సుభాష్

**కోనసీమ,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన రథశాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ప్రారంభించారు. కొన్ని సంవత్సరాల నుండి రథం వర్షానికి తడవడం చూసి, రక్షణ ఏర్పాట్లు చేయాలని దాత శ్రీకాకోళ్లపు సూర్యనారాయణ సూచించారు. రథం పాడవకుండా రథసాల నిర్మించడంపై మంత్రి సుభాష్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రథశాలను నిర్మించిన దాతను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెరుకుపల్లి గణెళిష్ శర్మ, ఆలయ ఈవోసిహెచ్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రారు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవిల్లి శివ, కంచుమర్తి బాబురావు, సుతాపల్లి వీరబాబు, బద్రి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



# జగన్ ఐదేళ్ల పాలనలో విధ్వంసం

## రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసిన ఘనుడు

## మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విమర్శలు

**నెల్లూరు,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

జగన్ హయాంలోని ఐదేళ్లలో ఏపీ అస్తవ్యస్థమైందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధ్వంస పాలనకు జగన్ పాలన సాక్ష్యమని విమర్శలు చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిందని ధ్వజమెత్తారు. సోమవారం నెల్లూరు జిల్లాలోని సంగం మండలం గాంధీజన సంఘం గ్రామంలో పర్యటించారు మంత్రి ఆనం. దిత్వా తుఫానును సైతం లెక్కచేయకుండా వర్షంలో పేదల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి.ఏపీలో ప్రతీ నెలా ఒకటో తేదీన పండుగ వాతావరణం ఉంటుందని తెలిపారు. కొన్ని లక్షల ఇళ్లను కట్టకుండానే కట్టినట్లుగా చూపించి గత జగన్ ప్రభుత్వంలోని కాంట్రాక్టర్లు డబ్బులు దోచుకున్నారని ఆరోపించారు. ఏపీ ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ నిధులు సమకూర్చుకొని రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 36,937 మంది అర్హులైన లబ్దిదారులకు పింఛన్లు అందజేస్తున్నామని చెప్పుకొచ్చారు



మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి. కూటమి ప్రభుత్వం చెప్పిన మాటకు కట్టుబడి ఉందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం పేదల శ్రేయస్సు కోసం ఎంతగానో కృషి చేస్తోందని తెలిపారు. వీర్లగుడిపాడు బ్రిడ్జి నిర్మాణానికి రూ.25 కోట్ల నిధులను మంజూరు చేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంత సీసీ రోడ్లకు రూ.27 కోట్ల నిధులు మంజూరు చేశామని గుర్తుచేశారు. ఏపీలో ఎన్ని విపత్కర పరిస్థితులు వచ్చిన ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీ ఆగదని చెప్పుకొచ్చారు. ఇంత వయస్సులో సైతం సీఎం చంద్రబాబు నాయుడు ప్రజల కోసం నిరంతరం పరితపిస్తున్నారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# వృద్దులకు పెన్షన్లు పంపిణీ

## ఓల్డ్ ఏజ్ హోమ్‌లో పంపిణీ చేసిన కలెక్టర్

**గుంటూరు,డిసెంబర్1(ప్రజా ఎన్‌కౌంటర్):**

ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సోమవారం ఉదయం పంపిణీ చేశారు. ఏ.టి.అగ్రహారం నాగవ లైన్ లో ఝాన్సీ మాతా ఓల్డ్ ఏజ్ హౌమ్ లో నివసిస్తున్న వయోవద్దులను ఆప్యాయంగా పలకరించి పించన్లను అందించారు. జిల్లా కలెక్టర్ వద్దుల ఆశ్రమంలో నివసిస్తున్న వారితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఎన్.టి.ఆర్ భరోసా పించన్లను అందిస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో మొత్తం 2,56,904 మంది పింఛనుదారులకు రూ. 111.34 కోట్లు పంపిణీ జరుగుతుందని చెప్పారు. జిల్లా మొత్తం పింఛన్లలో వద్ధాప్యపు పింఛన్లు 1,18,174., వితంతువులు 70,112., చేనేతకారులు 3,862., గీతకార్మికులు 443., మత్స్యకారులు 570., ఒంటరి మహిళలు 11,330., చర్మకారులు 876., హిజ్రాలు 67., హెచ్.ఐ.వి బాధితులు 2,614., కళాకారులు 77., డప్పు కళాకారులు 854., దివ్యాంగులు 24,835., వైద్య సంబంధిత పింఛనుదారులు 1667., సైనిక సంక్షేమం 28., అభయహస్తం 3,994., అమరావతి భూముల సంబంధిత 17,401 పింఛన్లు పంపిణీ ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విజయలక్ష్మి, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస రావు, వార్డు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రాజ్ నిడుమోరుతో సమంత ఏడడుగులు

## రూమర్స్‌ను నిజం చేసిన జంట

టాలీవుడ్ స్టార్ నటి సమంత  గత కొన్ని రోజులుగా నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. అందుకు కారణం రెండో పెళ్లే. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు రాజ్ నిడుమోరుతో సమంత డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొంత కాలంగా తెగ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. త్వరలో వీరు పెళ్లి చేసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో రూమర్స్ వచ్చాయి. ఇప్పుడు ఆ రూమర్సే నిజమయ్యాయి. సామ్-రాజ్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కోయంబత్తూర్‌లోని ఇషా యోగా సెంటర్లో గల లింగ భైరవి ఆలయంలో వీరి వివాహం జరిగింది. దక్షిణాది సంప్రదాయం ప్రకారం వీరు పెళ్లి చేసుకున్నారు. ఎరుపు రంగు కంచిపట్టు చీరలో సమంత ఎంతో అందంగా రెడీ అయ్యారు. ఉదయం నిశ్చితార్థం, ఆ వెంటనే పెళ్లి కూడా జరిగిపోయింది. ఈ వేడుకకు దగ్గరి బంధువులు, స్నేహితులు హాజరయ్యారు. ఈ శుభవార్తను సమంత ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది. ఈ మేరకు పెళ్లి ఫొటోలను కూడా షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇవి చూసిన నెటిజన్లు, అభిమానులు సామ్-రాజ్ జంటకు శుభకాంక్షలు చెబుతున్నారు. పలువురు సెలబ్రిటీలు సైతం శుభాకాంక్షలు చెబుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.



# బలగం వేణు ఎల్లమ్మ

## త్వరలోనే హీరో పేరు వెల్లడిస్తామన్న దిల్ రాజ్

'ఎల్లమ్మ' సినిమా అనౌన్స్ చేసిన రోజు నుంచి ఈ చిత్రాన్ని వరుస ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దర్శకుడు వేణు యూడుగంటి రూపొందిస్తున్న ఈ ప్రాజెక్ట్ పట్ల భారీ అంచనాలు ఉండగా, రెండేళ్లుగా హీరో ఎవరు అనే విషయంలో మాత్రం గందరగోళం కొనసాగుతోంది. మొదట ఈ సినిమాలో నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్నాడని ప్రకటించిన మేకర్స్, ఫస్ట్‌లుక్ కూడా విడుదల చేశారు. అయితే అనుకోని కారణాల వల్ల నాని ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు.తర్వాత ఈ చిత్రంలో నటించేందుకు శర్వానంద్ ఎంట్రీ ఇచ్చారు. కొంతకాలం తర్వాత ఆయనే తప్పుకున్నారు. అనంతరం నితిన్ హీరోగా ఫిక్స్ అయిపోయారని, షూటింగ్ కూడా త్వరలో ప్రారంభమవుతుందని నితిన్ స్వయంగా ప్రకటించారు.కానీ కొన్ని రోజులకే ఆయనను కూడా ఈ చిత్రం నుంచి తప్పించారని సమాచారం. ఇలా వరుసగా ముగ్గురు హీరోలు మారడంతో 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ భవిష్యత్తుపై ప్రశ్నలు మొదలయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో చివరకు ఈ చిత్రానికి సంబంధించి నిర్మాత దిల్ రాజు క్లారిటీ ఇచ్చారు. గోవాలో జరుగుతున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న దిల్ రాజు మీడియాతో మాట్లాడుతూ.. ఎల్లమ్మ సినిమాకు హీరో ఇప్పటికే ఫైనల్ అయ్యాడు. త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేస్తాం. అలాగే హీరోయిన్ వివరాలు కూడా డిసెంబర్‌లో వెల్లడిస్తాం. మా బ్యానర్ నుంచి 2026లో ఆరు సినిమాలు రిలీజ్ అవుతాయి. వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తాం. ప్రస్తుతం 'రౌడీ జనార్ధన్' షూటింగ్ జరుగుతోంది' అని తెలిపారు. దీంతో 'ఎల్లమ్మ' సినిమాను ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు ఇది నిజంగా గుడ్ న్యూస్. ఇన్ని మార్పుల తర్వాత కూడా ప్రాజెక్ట్ నిలిచేలా ఉండటం మేకర్స్ నమ్మకాన్ని చూపిస్తోంది. ఇప్పుడు అందరి చూపు కొత్త హీరో, హీరోయిన్ ఎవరన్న దానిపైనే ఉంది.ఈ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళుతుంది అనే దానిపై కూడా త్వరలోనే క్లారిటీ రానుంది. కొద్ది రోజుల క్రితం బలగం అనే చిత్రంతో బిగ్గెస్ట్ హిట్ కొట్టిన వేణు ఇప్పుడు తన రెండో చిత్రంతో ఎలాంటి విజయం అందుకుంటాడో చూడాలి.




# స్పిరిట్‌లో నెగెటివ్ షేడ్ రోల్

## కాజోల్ ఎంట్రీ అంటూ వార్తలు



అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి ట్రెండ్ సెట్టింగ్ చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్'పై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది. వివేక్ ఒబెరాయ్ ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించబోతున్నారు. ఈ చిత్రంలో కీలకమైన నెగటివ్ షేడ్స్ ఉన్న ఓ ముఖ్యమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ కాజోల్‌ను సంప్రదించినట్టు సమాచారం. మొదట ఈ పాత్రను బాలీవుడ్ స్టార్ కరీనా కపూర్ ఖాన్ చేయాల్సి ఉన్నా, కొన్ని కారణాల వల్ల ఆమె 'స్పిరిట్' నుంచి తప్పుకున్నారని టాక్. దాంతో ప్రత్యామ్నాయంగా కాజోల్‌ను తీసుకోవాలని చిత్రబృందం భావించినట్టు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. 1992లో 'బెఖుడి' ద్వారా బాలీవుడ్ లోకి అడుగుపెట్టిన కాజోల్, దక్షిణాది భాషల్లో చాలా అరుదుగానే నటించింది. ధనుష్‌తో నటించిన 'వి ఐ పి 2' లో విలన్ పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. ఇప్పుడు 'స్పిరిట్' ద్వారా ఆమెకు టాలీవుడ్‌కి రీఎంట్రీ ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. త్వరలోనే దీనిపై క్లారిటీ రానుంది. ఇక 'స్పిరిట్' షూటింగ్ ఇప్పటికే హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కీలక సన్నివేశాల్లో ప్రభాస్ పాల్గొన్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది. తన కెరీర్‌లో మొదటిసారిగా ప్రభాస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నందున అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. కొత్త లుక్, కొత్త బాడీ లాంగ్వేజ్‌తో ప్రభాస్ కనిపించబోతున్నారని సమాచారం. 'స్పిరిట్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి హాజరవడం పెద్ద చర్చకు దారి తీసింది. దీంతో ఆయన కూడా సినిమాలో ఒక కీలక అతిథి పాత్రలో కనిపించే అవకాశం ఉందని రూమర్స్ వస్తున్నాయి.

# దర్శకుడు శాంతారామ్ బయోపిక్

## సంధ్య పాత్రలో ప్రముఖ నటి తమన్నా

నటి తమన్నా భాటియా వరుసగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విభిన్నమైన పాత్రలతో జోరు మీదున్నారు. ఇటీవల ఓదెలా 2లో శక్తివంతమైన పాత్రతో, అలాగే అజయ్ దేవగన్ నటించిన రైడ్ 2లో ఆకట్టుకునే రోల్‌తో ప్రేక్షకులను మెప్పించిన ఆమెకు ఇప్పుడు మరో బిగ్ ఆఫర్ వచ్చినట్టు చిత్ర పరిశ్రమలో టాక్ నడుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు ..వీ. శాంతారాం జీవితకథ ఆధారంగా బయోపిక్ రూపొందించనుండగా, అందులో తమన్నా ఒక ముఖ్య పాత్రలో కనిపించ బోతున్నారు. అందులో ఆమె, శాంతారం భార్య అయిన ప్రముఖ నటి సంధ్య పాత్రను పోషించనున్నట్లు చెప్పుకుంటున్నారు. హిందీ, మరాఠీ సినిమాల్లో సాంధ్య ఓ ప్రముఖ నటి. వీ. శాంతారాం దర్శకత్వంలో ఆమె నటించిన అనేక చిత్రాలు అప్పట్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాయి. అందువల్ల సాంధ్య పాత్ర ఈ బయోపిక్‌లో అత్యంత ప్రాధాన్యమైనదిగా భావిస్తున్నారు. ఈ బయోపిక్‌కు 'చిత్రపతి వీ. శాంతారాం' అనే టైటిల్ ఖరారు చేసినట్లు సమాచారం. బాలీవుడ్ నటుడు సిద్దాంత్ చతుర్వేది వీ. శాంతారాం పాత్రలో నటించనున్నాడు. ఆయన కెరీర్‌లో ఇది భిన్నమైన, ప్రతిష్టాత్మక పాత్ర అవుతుందని పరిశ్రమ అంచనా వేస్తోంది. ఈ చిత్రాన్ని 'నటసామ్రాట్' సినిమాతో ప్రశంసలు అందుకున్న దర్శకుడు అభిజిత్ దేశ్‌పాండే తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలు, పాత్రల లోతును చూపడంలో ఆయనకు ఉన్న నైపుణ్యం దృష్ట్యా ఈ సినిమా కూడా ప్రత్యేకంగా నిలవొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కథ విన్న వెంటనే తమన్నా ఈ పాత్రపై ఆసక్తి చూపి అంగీకరించినట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా పాత్రలు ఎంపికకి కొత్త ప్రాధాన్యం ఇస్తున్న ఆమెకి, ఈ పాత్ర మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని సమాచారం. వీ. శాంతారాం సినీరంగానికి చేసిన సేవలు, ఆయన వినూత్న ప్రయోగాలు, వ్యక్తిగత జీవితం ఇలా ఎన్నో అంశాలను ఈ బయోపిక్‌లో చూపించనున్నారు.ఈ చిత్రం బాలీవుడ్‌లో మరో ప్రతిష్టాత్మక బయోపిక్‌గా నిలుస్తుందని, అలాగే తమన్నా నటనకు కొత్త మైలురాయి అవుతుందని అభిమానులు, ఫిల్మ్ సర్కిల్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.



# అఖండ-2 విడుదలపై అభిమానుల్లో ఉత్కంఠ

డిసెంబర్ 5న భారీ అంచనాల మధ్య విడుదల కానున్న నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ 2- తాండవం చిత్రంపై ప్రేక్షకుల్లో రోజు రోజుకి ఉత్కంఠ పెరుగుతోంది. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన తొలి పార్ట్ ఘన విజయంతో రెండో భాగంపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అయితే సినిమా విడుదలకు కేవలం కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండగా, మూవీ టీమ్ అర్ధరాత్రి సడెన్‌గా ఫుల్ జ్యూక్‌బాక్స్‌ను రిలీజ్ చేసి అభిమానులను సంబరాల్లో ముంచెత్తింది. మొత్తం 9 పవర్‌ఫుల్ అండ్ ఎనర్జిటిక్ ట్రాక్‌లు ఈ ఆల్బమ్‌లో చేర్చారు. విడుదలైన వెంటనే యూట్యూబ్, సోషల్ మీడియాలో ఈ పాటలు ట్రెండ్ అవుతూ, కామెంట్లతో అభిమానులు ముంచెత్తుతున్నారు. తొలి భాగంలా ఈ సారి కూడా మ్యూజిక్ ఆల్బమ్ భక్తిరసంతో పాటు మాస్ వైబ్స్‌ను పంచుతూ ప్రేక్షకులను కనెక్ట్ చేస్తోందనే అభిప్రాయాలు వస్తున్నాయి.




Printed & published owned by KEERTHI PURNIMA Nalgonda.Telagana sate Printed at 6-1-36 Boyawada nalgonda
RNI.NO :APTEL/2018/75524, E-Mail- vallapudevendhar@gmail.com